

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 11.09.2025 | సంపుటి : 2 | సంచిక :219 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Thursday 11.09.2025 volume : 2 Issue : 219 Pages : 8 Cost : 2/-

## సాదాబైనామాలకు
# లైన్ క్లియర్

- క్రమబద్ధీకరణకు నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- భూ భారతి చట్టంలో ఇప్పటికే ప్రత్యేక సెక్షన్
- 9.80 లక్షల దరఖాస్తులకు దక్కనున్న హక్కులు




తెల్ల కాగితాలపై రాసుకున్న భూ కొనుగోలు ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణకు రాష్ట్ర రెవెన్యూశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2020 అక్టోబరు 12 నుంచి అదే ఏడాది నవంబరు 10 వరకూ వచ్చిన దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తామని తెలిపింది. భూ భారతి చట్టం సెక్షన్-6లోని సబ్ సెక్షన్-1 కింద సాదాబైనామా పత్రాలను క్రమబద్ధీకరించనున్నట్లు పేర్కొంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 10 :
2024 జూన్ 2కి ముందు భూమి తమ సాగులోనే ఉన్నట్లు సాదాబైనామా పత్రం కలిగిన, పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా దరఖాస్తు చేసుకున్న చిన్న, సన్నకారు రైతులు క్రమబద్ధీకరణకు అర్హులని వివరించింది. కనీసం 12 ఏళ్లకు పైగా భూమిని అధీనంలో ఉంచుకున్నవారి దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తామని తెలిపింది. దీని ప్రకారం రాష్ట్రంలో 9.80 లక్షల దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పట్టణాలు మినహా ఇతర చోట్ల 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన సాదాబైనామాలను 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. 2020లో మరోమారు దరఖాస్తులను ఆహ్వానించింది.

మిగతా 2 లో


10

## నేపాల్‌లో ఆర్మీ కర్ఫ్యూ..
భారత సరిహద్దులో హై అలర్ట్


03

## 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పదవీ ప్రమాణం
రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



## రక్షణ శాఖ భూములను
# బదలాయించాలి

- మెహిదీపట్నం వద్ద స్కైవాక్ ప్రాజెక్ట్
- రాజీవ్ రహదారిలో ఔటర్ వరకు ఆరులైన్ల విస్తరణ
- లంగర్‌హౌజ్‌లో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం
- రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ
- రక్షణశాఖ భూములు బదిలీ చేయాలని కోరిన సీఎం రేవంత్
- చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. కంటోన్మెంట్‌లో రహదారి విస్తరణ, రక్షణశాఖ భూముల బదలాయింపుపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలి వేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరిం చారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణశాఖ ఆధీనంలో ఉన్న భూ ములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీ పట్నం రైతుబజార్ వద్ద స్కైవాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణను కూడా ప్రస్తావించారు.

మిగతా 3 లో



## 10 వేల మందితో
# బతుకమ్మ

- 28న ఎల్బీ స్టేడియంలో నిర్వహణకు సన్నాహాలు
- ప్రపంచ రికార్డు లక్ష్యంగా...

02


02

## బీజేపీని నాశనం చేసే
# కుట్రలు

- రాష్ట్ర కార్యవర్గంలో కిషన్ రెడ్డి అనుచరులు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేది లేదన్న రాజాసింగ్

# ఉపరితల ఆవర్తనం

- ఈ నెల 14 వరకు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణ లోని పలు జిల్లాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో.. వచ్చే నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో పలు చోట్ల.. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచి ర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశ ముందన్నారు.


03

## వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో
# వేగంగా సహాయక చర్యలు

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

ఇటీవల భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో పనులను ముమ్మరం చేయాలన్నారు.

02




03

## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర
కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వెల్లడి

అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక జరుగుతుందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

## పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో
# చూడండి

03

- అందుకే మన రాజ్యాంగం పట్ల మేము గర్విస్తున్నాం
- గవర్నర్ల కేసు సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్య



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** సుప్రీంకోర్టు, బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో పెట్టే అంశాన్ని విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రస్తావించింది. బుధవారం సుప్రీం కోర్టులో ఏప్రిల్ 12న ఇచ్చిన ఉత్తర్వులపై విచారణ జరిగింది. రాష్ట్రాలు రూపొందించిన బిల్లులను క్లియర్ చేయడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భారత రాజ్యాంగాన్ని ప్రస్తావిస్తూ - ప్రజా ప్రాముఖ్యత లేదా ఏ విధంగానైనా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరే హక్కును నిర్వచించారు.

03

## భారత్, చైనాలపై 100 శాతం
# సుంకం విధించండి

- రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపేస్తామనే వరకు టారిఫ్‌లను కొనసాగించాలి
- ఈయూకు ట్రంప్ సూచన
- అమెరికా సూచనలు అమలు చేసేందుకు సిద్ధం : ఈయూ అధికారులు

ఉక్రెయిన్ యుద్ధం ముగించే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా భారత్, చైనాలపై సుంకాల భారాన్ని పెంచి రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించాలని ట్రంప్ యూరోపియన్ యూనియన్ (ఈయూ)ను కోరినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించే అంశంపై సీనియర్ అమెరికన్, ఈయూ అధికారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఈయూ అధికారులతో ట్రంప్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడారు. రష్యాపై ఆర్థికఒత్తిడి తీసుకువచ్చేందుకు భారత్, చైనాలపై 100 శాతం సుంకం విధించాలని సూచించినట్లు తెలుస్తోంది.

10



# సాదాబైనామాలకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

అయితే, ఆర్వోఆర్-1971కి సవరణతో 2020 అక్టోబరు 29న తీసుకొచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు చేర్చలేదు. పైగా 2020 చట్టానికి ముందు, ఆ తరువాత దరఖాస్తులను స్వీకరించడం న్యాయ వివాదానికి దారితీసింది. 1971 చట్టం అమల్లో ఉన్నప్పుడు తీసుకున్న దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. క్రమబద్ధీకరణను న్యాయస్థానం నిలిపివేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపడతామ ంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆ తరువాత పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. న్యాయ వివాద పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సాదాబైనామా రైతులకు 13-బీ ప్రొసీడింగ్స్ జారీ చేయ డానికి హైకోర్టు ఇటీవల అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభు త్వం తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్వోఆర్-2020 స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్-2025 భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చి ంది. ఈ చట్టంలోని సెక్షన్-6 ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకర ణకు అవకాశం కల్పించింది. విచారణ అధికారిగా ఆర్డీవోకు బాధ్యతలు అప్పగించింది. ఒకవేళ ప్రభుత్వం కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలనుకుంటే దరఖాస్తు చేసుకున్న నాటి స్టాంపు డ్యూటీ మాత్రమే వసూలు చేయాలని చట్టం సూచిస్తోంది. క్రమబద్ధీకరణ పూర్తయితే రైతులకు భూములపై యాజమాన్య హక్కులు లభించి, కొత్త పట్టా పాసుపుస్తకాలు జారీ కావడంతో పాటు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.



## 10 వేల మందితో బతుకమ్మ

- 28న ఎల్బీ స్టేడియంలో నిర్వహణకు సన్నాహాలు
- ప్రపంచ రికార్డు లక్ష్యంగా...

**హైదరాబాద్:** బతుకమ్మ పండగను 10 వేల మంది ఆడపడుచులతో నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. 2016లో గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం బల్దియా అధికారులు విఫలయత్నం చేశారు. భారీ వర్షం కారణంగా అప్పుడు చేసిన ఏర్పాట్లు ఫలితమివ్వలేదు. ఈసారి పకడ్బందీ ఏర్పాట్లతో రంగంలోకి దిగుతామని జీహెచ్‌ఎంసీ ధీమా వ్యక్తంచేస్తోంది. కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో పట్టణ సామాజికాభివృద్ధి విభాగం అదనపు కమిషనర్ ఎస్.పంకజ ఏర్పాట్లు చేస్తున్నారు. "జీహెచ్‌ఎంసీ తరఫున ఆరు వేల మందిని సమీకరిస్తున్నాం. మెప్మా, సెర్ప్‌లు శివారు జిల్లాల నుంచి మరో నాలుగు వేల మందికి తగ్గకుండా సమీకరిస్తాం. వారందరికీ 27న శిక్షణ ఇచ్చి, 28న బతుకమ్మ వేడుకను నిర్వహిస్తాం. ఈ వేడుక కోసం తీరొక్క పూలతో 52 అడుగుల బతుకమ్మను సిద్ధం చేస్తున్నాం" అని ఆమె వెల్లడించారు. దసరా ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించేందుకు వేర్వేరు ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 22 నుంచి 26 వరకు దేవాలయాలు, వారసత్వ కట్టడాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై 27న హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో కార్నివాల్ ఉంటుంది. తెలంగాణ పిండి వంటకాలు, ఇతరత్రా తినుబండారాలు, ఆహార పదార్థాల ప్రదర్శన, వాటి విక్రయ కేంద్రాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీలు, మహిళా బైక్ రైడర్స్‌తో సమావేశాలు నిర్వహిస్తారు. 30న సచివాలయం ముందున్న అమరవీరుల స్తూపం నుంచి వందల మంది మహిళలు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఘాట్ వరకు బతుకమ్మ ఆడుతూ ర్యాలీగా వెళ్తారు.




## ప్రజాస్వామ్యం పట్ల ఆ ఇద్దరికీ గౌరవం లేదు

### మోడీ, అమిత్ షాలపై ఖర్గే విమర్శలు

**గాంధీనగర్,సెప్టెంబర్ 10 :** భారత రాజ్యాంగాన్ని గానీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశం మోడీ, అమిత్‌షాలకు లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఖర్గే గుజరాత్‌లోని జునాగఢ్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షాల ప్రధాన లక్ష్యం ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడడటమే. ప్రజాస్వామ్యంలో పోరాడటం సర్వసాధారణమే. కానీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే మా లక్ష్యం. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభారుపటేల్ వంటి గొప్ప వ్యక్తులు జన్మించిన భూమి ఇది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన ఈ ఇద్దరు మనకు అత్యంత గౌరవనీయులు. వారివల్లే దేశం ఐక్యం ఉంది. కానీ మరో ఇద్దరు వ్యక్తులు మోడీ, అమిత్‌షా మాత్రం రాజ్యాంగం సురక్షితంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కానీ కోరుకోవడం లేదు' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎన్నిలపై ఆయన స్పందించారు. 'మాకు మెజారిటీ- లేదు. అయినప్పటికీ మాకు ఉన్నన్ని ఓట్లు- వచ్చాయి' అని ఖర్గే అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని, దీన్ని తీవ్రమైన విషయంగా పరిగణించి దర్యాప్తు చేయాలని ఆయన అన్నారు.



## అవినీతి సొమ్మును కక్కిస్తాం

- రాజకీయ కక్షసాధింపులకు తావు లేదు
- మీడియాతో మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ, సెప్టెంబర్ 10 :** కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ- కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అవినీతి సొమ్మను రాబడతామని అన్నారు. బిఆర్ఎస్ నేతలు అవినీతిలో రాజ్యమేలారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేసింని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ- రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ - 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్టు- ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.

## వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో వేగంగా సహాయక చర్యలు

### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్: ఇటీవల భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో పనులను ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు బుధవారం హైదరాబాద్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇంతవరకు తీసుకున్న సహాయక చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతోపాటు సాగునీరు, పంచాయతీరాజ్, ఆరోగ్యం, పురపాలక, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. "ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలావరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గింది. ఎవరికైనా పరిహారం అందకపోతే వెంటనే విడుదల చేయాలి. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లు విడుదల చేశాం. సహాయక చర్యలను సంబంధిత జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్ నుంచి వివిధ శాఖల విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షణ జరపాలి. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 13వ తేదీలోపు శాఖలవారీగా యూసీలను సమర్పించాలి.

అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి" అని మంత్రి దిశానిర్దేశం చేశారు.

### నిజమైన జర్నలిస్టులకు మేలు జరగాలి..

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచివాలయంలో బుధవారం ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, సీపీఆర్వో మల్సూర్‌తో కలిసి జర్నలిస్టుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ పాలసీ, హెల్త్‌పాలసీ, అవార్డులు, దాడులపై ఏర్పాటుచేసిన హైపవర్ కమిటీ తదితర అంశాలపై చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థిక శాఖల అధికారులతో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## బీజేపీని నాశనం చేసే కుట్రలు

- రాష్ట్ర కార్యవర్గంలో కిషన్ రెడ్డి అనుచరులు
- పార్టీ పెద్దల ఆశీర్వాదం ఎప్పుడూ తనకే
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేది లేదన్న రాజాసింగ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** బీజేపీని సర్వనాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీలో నా మనిషి, నీ మనిషి అనే రాజకీయం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కొత్త కమిటీలో 12 మంది ఒకే పార్లమెంటు సెగ్మెంట్ వాళ్లు ఉన్నారని చెప్పారు రాజాసింగ్. రాష్ట్ర కమిటీని కిషన్ రెడ్డి వేశారా? లేక రామచందర్ రావు వేశారా అని ప్రశ్నించారు. రామచందర్ రావు మంచి వ్యక్తే కానీ..రబ్బర్ స్టాంప్ అని అన్నారు. ఈ ప్లానింగ్ అంతా కిషన్ రెడ్డిదేనని విమర్శిం చారు. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తాను కూడా చేస్తానని అన్నారు. కిషన్ రెడ్డి ఇండిపెండెంట్ గా పోటీ- చేయాలి. నేనూ చేస్తా..ఎవరు గెలుస్తారో చూసుకుందాం అని సవాల్ విసిరారు. రాజాసింగ్ ఎప్పుడైనా ఏక్ నిరంజన్ అని..తన వెనుక ఎవరూ లేరన్నారు .రాజీనామా చేయనని ఏం చేసుకుంటారో చేసుకోండని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చే పార్టీని పండబెట్టారని వ్యాఖ్యానించారు. ఇపుడు ఏ కార్యకర్త పనిచేయ డానికి ఇష్టపడటం లేదన్నారు. తనపై పోస్టులు పెట్టిన వ్యక్తి ఎక్కడుం టాడో చూసుకోవాలని హితవు పలికారు. తన గురించి విమర్శించే వాళ్లు వాళ్ల గురించి ఆలోచించుకోవాలని సూచించారు రాజాసింగ్. తన మీద



విమర్శలు చేసే అర్హత ప్రధాన కార్యదర్శి అశోక్ కు లేదన్నారు. గతంలో ఏబీవీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిచ్చిన చరిత్ర అశోక్ దని చెప్పారు.నెలకు డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తల గొంతుకగా తాను మాట్లాడుతున్నానని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా.ఢిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉ ంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఢిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉ న్నా అని రాజా సింగ్ తెలిపారు.

## నేపాల్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు

- మాజీ చీఫ్ జస్టిస్ట్ సుశీలా కర్కీకి బాధ్యతలు
- జెన్-జెడ్ ఉద్యమకారులు మొగ్గు

**ఖాట్మండ్, సెప్టెంబర్ 10 :** కల్లోల నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగున్న నేపథ్యంలో తాత్కాలిక సారథిని ఎన్నుకునేందుకు అక్కడి యువత ముమ్మర చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీ వైపు జెన్-జెడ్ ఉద్యమకారులు మొగ్గుచూపినట్లు- తెలుస్తోంది. తాత్కాలిక సారథిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆమె కూడా సిద్ధంగా ఉన్నట్లు- సమాచారం. అవినీతికి వ్యతిరేకంగా నేపాల్‌లో కొనసాగుతున్న ఉద్యమం హింసాత్మక ఘటనలకు దారితీయడంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో కొత్త సారథిని ఎన్నుకునేందుకు జనరేషన్-జెడ్ ఉద్యమకారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు 5వేల మంది బుధవారం వర్చువల్‌గా సమావేశమై మంతనాలు జరిపారు. కాఠ్‌మాండూ మేయర్ బాలెన్ షాను తొలుత పరిగణనలోకి తీసుకున్నప్పటికీ ఆయన నుంచి స్పందన రాలేదని తెలిసింది. దీంతో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీ వైపు 'జెన్-జెడ్' ప్రతినిధులు మొగ్గుచూపినట్లు- నేపాల్ మీడియా వెల్లడించింది. బాధ్యతలు స్వీకరించేందుకు కర్కీ సిద్ధమైతే.. తొలుత ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌తో భేటీ- కావాల్సి ఉంటు-ంది. ఆ తర్వాత అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆమోదం పొందాల్సి ఉంటు-ందని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సుశీలా కర్కీ (72)కి నేపాల్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మరకలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2016లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. నేపాల్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు ముగ్గురు పోలీసులు సహా 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు- అధికారులు వెల్లడించారు. మరో 633 మంది గాయాలపాలైనట్లు- తెలిపారు. ఆందోళనల్లో గాయపడిన నేపాలీ కాంగ్రెస్ చీఫ్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య, విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్‌బాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటు-న్నట్లు- తెలిసింది. నేపాల్‌లో ఆందోళనలు అదుపులోకి రాకపోవడంతో సైన్యం నిరవధిక కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే.

## పేట బషీరాబాద్‌లో గొలుసు దొంగలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల చైన్ స్నాచింగ్ జరిగింది. బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు కెవి రెడ్డి నగర్ లో వాకింగ్ చేస్తున్న బాలమణి మేడలో నుంచి ఐదు తులాల చైన్ లాక్కొని పారిపోయారు. మరో ఘటనలో ఎన్ సి ఎల్ కాలనీలో బస్సు కోసం బస్ స్టాప్ లో వేచి ఉన్న ఓ యువతీ మెడలో చైన్ స్నాచింగ్ కు యత్నించారు. గొలుసు తెగిపోవడంతో అక్కడి నుంచి స్నాచర్ పారిపోయాడు. గంట వ్యవధిలో ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచర్లు హల్ చల్ చేయడంతో పోలీసులు అలెర్టయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**అలంపూర్, సెప్టెంబర్ 10 :** జోగులంబ గద్వాల్ జిల్లాలో అయిజ మండలం భూంపురంలో విషాదం చోటు- చేసుకుంది. బుధవారం పత్తి పొలంలో పనులు చేసుకుంటున్న వారిపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే స్పందించి.. వారిని గద్వాల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతులు సాభాగ్య (40), పార్వతి (22), సర్వేష్ (20)గా గుర్తించారు.

## దాడికి గురవుతున్న ప్రజాస్వామ్యం

- నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం విఫలం
- బీహార్ తరహా వైఫల్యం ఇతరరాష్ట్రాల్లోనూ సాధ్యం
- సిపిఐ సమావేశాల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

**తిరువనంతపురం,సెప్టెంబర్ 10 :** దేశంలో ప్రజాస్వామ్యం నిరంతరం దాడికి గురవుతోందని, స్వేచ్ఛాయుత వాతావరణం లో ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమైం దని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మండిపడ్డారు. బుధవారం కేరళలోని అలప్పుజలో జరిగిన సిపిఐ రాష్ట్ర కమిటీ- సమావేశాల్లో ప్రతినిధుల సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను విమర్శిస్తూ.. ప్రజల ఓటు హక్కును లాక్కుంటున్నారని మండిపడ్డారు. బీహార్‌లోని అర్హులైన ఓటర్లందరికీ ఓటు- హక్కును కల్పించడంలో ఇసి విఫలమై ంది. ఇది ఏ రాష్ట్రంలోనైనా జరగ వచ్చన్నారు. ఎన్నికల సంఘం ఒక రాజ్యాంగ సంస్థ . తటస్థంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు- హక్కుకు హామీ ఇవ్వాలి. కానీ స్వేచ్ఛగా, న్యా యంగా ఎన్నికలు నిర్వహించడంలో ఇసి విఫలమైందని అన్నా రు. భారతదేశం తీవ్రమైన ముప్పులను ఎదుర్కొంటోందని అన్నారు. మితవాద శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. ఆర్ఎస్ఎస్ ఒక నియంతృత్వ శక్తి. బిజెపి ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం తప్ప మరొకటి కదు. వారు భారతదేశాన్ని నియంతృత్వ రాజ్యంగా, మతపరమైన దేశంగా మార్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని అన్నారు. ఒకేదేశం ఒకే ఎన్నికను తీవ్రంగా విమర్శిస్తూ.. అది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని అన్నారు. ఆర్ఎస్ఎస్ భారతదేశాన్ని భిన్న రూపాల, భిన్న సాంస్కృతిక, బహుభాషా దేశంగా గుర్తించడం లేదు. ఆర్ఎస్-ఎస్, బిజెపిలు భారతదేశాన్ని ఏకరూప దేశంగా మార్చాలని కోరుకుంటు-న్నాయి. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాలను కూల్చివేయాలని కోరుకుంటున్నాయి. మితవాద, ఫాసిస్ట్ శక్తుల నుండి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటు-న్నామని, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. మనం ఆదర్శంగా నివాలని, కమ్యూనిస్ట్ విలువలు మరియు నైతికతను బలోపేతం చేయాలని అన్నారు.

## 'స్థానిక' ఎన్నికలకు ఓటర్ల తుది జాబితాలు సిద్ధం

**హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ, జడ్పీటీసీల) వారీగా ఓటర్ల తుది జాబితాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 2న వార్డులు, గ్రామ పంచాయతీలవారీగా ఓటర్ల జాబితాలను ముద్రించిన అధికారులు బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా రూపొందించారు. పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించి వాటి జాబితాను ప్రచురించారు. రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల వారీగా ఓటర్ల జాబితాలను పంచాయతీరాజ్‌శాఖ బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపింది. బీసీ రిజర్వేషన్ల శాతం, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలో రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుని ఎన్నికల సంఘానికి నివేదిస్తే అది ఎన్నికల నిర్వహణను చేపడుతుంది.

# అత్యవసరంగా స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం

- మెహిదీపట్నం వద్ద స్కైవాక్ ప్రాజెక్ట్
- రాజీవ్ రహదారిలో ఔటర్ వరకు ఆరులైన్ల విస్తరణ
- లంగర్‌హౌజ్‌లో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం
- రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ
- రక్షణశాఖ భూములు బదిలీ చేయాలని కోరిన సీఎం రేవంత్
- చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. కంటోన్మెంట్‌లో రహదారి విస్తరణ, రక్షణశాఖ భూముల బదలాయింపుపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణశాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కైవాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణను కూడా ప్రస్తావించారు. హైదరాబాద్–కరీంనగర్–రామగుండంను కలిపే ఈ రహదారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్ జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణశాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వాటితో పాటు, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. లంగర్‌హౌజ్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమ ప్రాంతంలో 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ' నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిలుస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం నిర్మిస్తామని తెలిపారు. చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం వివరించారు. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, అణచివేత, దమన కాండపై చాకలి ఐలమ్మ ధిక్కార పతాకాన్ని ఎగురవేశారని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధు రాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు అని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు గుర్తుచేశారు.



## పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి

- అందుకే మన రాజ్యాంగం పట్ల మేము గర్విస్తున్నాం
- గవర్నర్ల కేసు సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్య

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** సుప్రీంకోర్టు, బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో పెట్టే అంశాన్ని విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రస్తావించింది. బుధవారం సుప్రీంకోర్టులో ఏప్రిల్ 12న ఇచ్చిన ఉత్తర్వులపై విచారణ జరిగింది. రాష్ట్రాలు రూపొందించిన బిల్లులను క్లియర్ చేయడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భారత రాజ్యాంగాన్ని ప్రస్తావిస్తూ – ప్రజా ప్రాముఖ్యత లేదా ఏ విధంగానైనా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరే హక్కును నిర్వచించారు. "మన రాజ్యాంగం పట్ల మేమే గర్విస్తున్నాం," అని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. "మన పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్ పరిస్థితిని చూశాం," అని సీజేఐ పేర్కొన్నారు. నేపాల్‌లో జెన్‌జెడ్ యువత చేస్తున్న హింసాత్మక ఆందోళనలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. "బంగ్లాదేశ్‌లో కూడా ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి," అని జస్టిస్ విక్రమ్ నాథ్ జోక్యం చేసుకున్నారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో హింసాత్మక అల్లర్ల కారణంగా, షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చారని చెప్పారు. ఒక నెలకు పైగా బిల్లులను రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్లను సమర్థిస్తూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించిన తర్వాత సుప్రీంకోర్టు నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లుల్లో 90 శాతం బిల్లులు ఒక నెలలోపే గవర్నర్లు క్లియర్ చేస్తారని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. 1970 నుంచి 2025 వరకు కేవలం 20 బిల్లులే రిజర్వ్ చేయబడ్డాయని కోర్టుకు తెలియజేశారు. అయితే, ఈ గణాంకాలను తాము పట్టించుకోమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 7 బిల్లులను రిజర్వ్ చేయడంతో డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయం కోరిన అంశం పై, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

## 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పదవీ ప్రమాణం

### రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. ఈనెల 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించను న్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు– చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు– రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్–ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేయనున్నట్లు– తెలుస్తోంది.

## సర్వేపల్లి స్ఫూర్తిని కొనసాగించండి

### రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపిన జైరామ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** దేశ 15వ ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గానూ ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి నిష్పక్షపాతంగా వ్యవహరించడం ముఖ్యమని పేర్కొంటూ.. మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ చైర్మన్ అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఉదహరించారు. 'ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా మరియు స్పష్టంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను అనుమతించకపోతే ఆ ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. 1952 మే16న రాజ్యసభ ప్రారంభం రోజున, ప్రముఖ విద్యావేత్త, తత్వవేత్త, రచయిత, దౌత్యవేత్త ఈవిధంగా అన్నారు. 'నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు. అంటే ఈ సభలోని ప్రతి పార్టీకి చెందినవాడిని. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యున్నత విలువలను, సాంప్రదాయాలను నిలబెట్టడం, ప్రతి పార్టీ పట్ల న్యాయంగా, నిష్పాక్షికంగా వ్యవహరించడం, ఎవరిపట్లా ద్వేషం లేకుండా, అందరిపట్ల సద్భావనతో వ్యవహరించేందుకు యత్నిస్తాను. ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష పార్టీలు న్యాయంగా, స్వేచ్ఛగా స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ' డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ తాను బోధించిన దానిని అక్షరాలా స్ఫూర్తితో ఆచరించారని ఉద్ఘాటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ 452 ఓట్లతో తదుపరి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఇండియా కూటమి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి 300 ఓట్లను సాధించారు.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

- ఈ నెల 14 వరకు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో.. వచ్చే నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో పలు చోట్ల.. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందన్నారు. దీంతో పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జోగులాంబ జిల్లాలో ఇవాళ సాయంత్రం పిడుగుపాటుకు ముగ్గురు కూలీలు మృతి చెందారు. బుధవారం సాయంత్రం సికింద్రాబాద్, బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొన్న నగరవాసులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో రహదారులపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## బోధన్‌లో ఉగ్ర కలకలం.. అనుమానితుడి అరెస్ట్

**బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అనుమానిత ఉగ్రవాది ఎన్ఐఏ అధికారులకు పట్టుబడటం కలకలం రేపింది. స్థానిక పోలీసుల సహకారంతో బోధన్ పట్టణంలో బుధ వారం తెల్లవారు జామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన ఎన్ఐఏ, పటియాలా పోలీసులు.. ఐసిస్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బోధన్ కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం పటియాలాకు తరలించారు. ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఎన్ఐఏ, దిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఐసిస్‌తో సంబంధాలు కలిగి ఉన్న వారిపై నిఘా ఉంచాయి. ఈ క్రమంలో అషర్ డానిష్‌ను జారండ్‌లోని రాంచీలో అరెస్ట్ చేశాయి. అతడు ఇచ్చిన సమాచారం మేరకు దేశ వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాయి. దిల్లీలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో తెలంగాణలోని బోధన్ పట్టణంలో ఎన్ఐఏ అధికారులు జల్లెడ పట్టాయి. పక్కా సమాచారం మేరకు ఉగ్ర మూలాలు కలిగిన వ్యక్తిని అరెస్టు చేశాయి.

## పోటీ పరీక్షల విషయంలో గత ప్రభుత్వ వైఖరినే కాంగ్రెస్ కొనసాగిస్తోంది

### తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్:** గ్రూప్ – 1 పరీక్ష పత్రాలు రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి లక్షలాది మంది విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. టీజీపీఎస్సీ వ్యవస్థలో ఉన్న లోపాలు బయటకు వచ్చాయని చెప్పారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం వరకు టీజీపీఎస్సీ చాలా లోపాలతో కూడిన విధానాలను అవలంబించిందని ఆరోపించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని, ఈ తీర్పు ద్వారా వారికి న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. గత భారత రాష్ట్ర సమితి హయాంలో పేపర్ లీకేజీ ఘటనలతో వేలాది మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అదే పరంపరను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు.





# రాత్రనక.. పగలనక

### యూరియా కోసం అర్ధరాత్రి నుంచే రైతుల బారులు

**సిద్దిపేట, సెప్టెంబర్ 10 :** సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి రైతువేదిక ఎదుట యూరియా కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం వరుసకట్టిన నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అసహనానికి గురైన రైతులు వేదికలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. కేవలం 1120 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్నదాతలు మాత్రం వేల సంఖ్యలో బారులు తీరారు. ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై కీర్తి కుమార్, మిరుదొడ్డి ఎస్సై సమతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల సమక్షంలో భారీ బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. 3 వేల మంది టోకెన్లు దొరకక నిరాశతో వెనుతిరిగారు.



## జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర

### కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక జరుగుతుందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నాం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అవుతుంది," అన్నారు. "ఓటుకు రూ.5,000 పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారు," అంటూ ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. "సీఎం సోదరుడు చెరువులో ఇల్లు కట్టినా హైడ్రా వెళ్లదు, కానీ పేదల బస్తీల్లోకి వెళ్లి ఇళ్లు కూలగొడతారు," అని ఆరోపించారు. "ఉపఎన్నిక కోసం సర్వేలు చేస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. అయితే కొన్ని బస్తీల్లో వెనుకబడ్డాం. అందరూ కలసి పనిచేసి గెలుపునకు కృషి చేయాలి," అని పిలుపునిచ్చారు. "ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉంటే తొలగించాలి. లేనివారి పేర్లు చేర్చాలి. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు నిలిపేస్తామని, ఇళ్లు కూల్చేస్తామని కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారు," అన్నారు. "పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు, కానీ మూసీ ప్రాజెక్టుకు మాత్రం నిధులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి," అని కేటీఆర్ స్పష్టం చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనారిటీ మంత్రి కూడా లేరు," అని విమర్శించారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత మాట్లాడుతూ "గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరూ కలిసి పనిచేయాలి. ఆయనలాగే నాకు కూడా కార్యకర్తలు అండగా నిలవాలి," అని కోరారు. "భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుంది," అని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. "జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తాం," అని ధీమా వ్యక్తం చేశారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేం

### నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక ఐలమ్మ, భూమి కోసం, భుక్తి కోసం తిరుగుబాటు– చేసి ప్రజా వ్యతిరేక పాలనపై దండెత్తిందని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెను కేటీ–ఆర్ స్మరించుకున్నారు. చాకలి ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిందని కేటీఆర్ తెలిపారు. బహుజన చైతన్యానికి, మహిళా ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మకు జోహార్లు తెలిపారు.

# లొట్టపీసు కేసులపై ముందుకెళ్లేదెలా?



రాజకీయ అవినీతిపై ఎవరు చర్యలు తీసుకోవాలి? ఎక్కడ దీనికి అంతం పలకాలి? దేశంలో అవినీతి రాజ్యమేలుతోంది. పక్క దేశాల్లో ప్రజల తిరుగుబాటును చూశాక పాలకులు కళ్లు తెరవాలి. "మనకేం కాదు లే" అనుకుంటే కుదరదు. ప్రజాగ్రహం కట్టలు తెంచుకునే వరకు చూడకుండా జాగ్రత్త పడాలి. అధికారంలోకి రాగానే అక్రమంగా సంపాదించడం, అధికారం పోయిన తర్వాత "లొట్టపీసు కేసు" అంటూ ఎగతాళి చేయడం అలవాటుగా మారింది. ఏపీలో జగన్, తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం అవినీతి కట్టలు తెంచుకుంది. ఇలాంటి అవినీతి కేసులను త్వరగా విచారించడం ఇప్పుడున్న కోర్టుల పరిధికి మించిన పని. ఇలాంటి కేసుల్లో సకాలంలో విచారణ జరిపి శిక్షలు పడేలా చేయాలి. కాళేశ్వరం విషయంపై రెండు సంవత్సరాలుగా విచారణ సాగించి ఇప్పుడు సీబీఐకి అప్పగించారు. అలాగే ఈ ఫార్ములా కేసులో ఏసీబీ ఇప్పుడు నివేదిక ఇచ్చింది. ఇవన్నీ చూస్తుంటే సత్వర విచారణ చేసి శిక్షలు పడే అవకాశం కనిపించడం లేదు. తప్పు చేసి అక్రమంగా డబ్బులు సంపాదించిన రాజకీయ నేతల్లో అందుకే ధీమా కనిపిస్తోంది. తమ జీవితకాలంలో విచారణలు జరిగి శిక్షలు పడవన్న ధీమాలో ఉన్నారు. అందుకే పరస్పర విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. "లొట్టపీసు కేసు" అంటూ ఎగతాళి చేస్తున్నారు. ఈ ఫార్ములాలో అడ్డంగా దొరికిన కెటిఆర్ వ్యాఖ్యలు చూసితే ఎవరికైనా ఒళ్లు మండుతుంది. క్విడ్ ప్రో కో జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నా... "లొట్టపీసు కేసు" అంటూ ముందుగానే ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజలు కూడా పెద్దగా రాజకీయ నాయకుల అవినీతిపై చర్చించడం లేదు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గత పాలకుల అవినీతి తారస్థాయికి చేరింది. అలాగే రాష్ట్రాలను అప్పుల్లో ముంచారు. తాజాగా ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్పుల గురించి ప్రస్తావించింది. కేసీఆర్, జగన్ పాలనలో అవినీతి తో పాటు రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోయాయి. విభజన కారణంగా ఈ రెండు కుటుంబాలు బాగా సంపాదించుకున్నాయని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డిలు పదేపదే ఆరోపిస్తున్నారు. అవినీతి కారణంగా విభజిత రాష్ట్రాల్లో అభివృద్ధి పక్కకు పోయింది. అభివృద్ధి పేరుతో అప్పులు మిగిలాయి. అప్పులను రీ స్ట్రక్చర్ చేయాలని కేంద్రం ముందు దూరుతున్నారు. విభజన కారణంగా ప్రజలకు మిగిలింది అప్పులే.

ఇలా నేతలు తమ ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా... కేంద్రం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రాలు చేసే అప్పులపై లేదా కేంద్రం చేసే అప్పులపై ఎక్కడా చెక్ లేకుండా పోయింది. అలాగే రాజకీయ నేతల అవినీతిపై కోర్టుల్లో కేసులు తేలడం లేదు. దీనిని నివారించి, రాజకీయాల్లో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకురావాలని లోక్‌పాల్ అవసరం ఉందని గతంలోనే సామాజికవేత్త అన్నా హజారే పోరాటం చేసినా లాభం లేకుండా పోయింది. అన్నా ఉద్యమాన్ని హైజాక్ చేసి, ఆప్ పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ఇప్పుడు అవినీతి కేసులో ఇరుక్కొని జైలుజీవితం గడిపారు. అధికారం పోగట్టుకున్నారు. కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నించిన కేజ్రీవాల్ ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు జగన్, కేసీఆర్ అవినీతి అక్రమాలపై ఎవరు చర్యలు తీసుకోవాలి? ఎవరు కేసులు పెట్టాలి అన్నదే ప్రశ్న. గతంలో పదేపదే కేసీఆర్ అవినీతి గురించి మాట్లాడిన ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇప్పుడు చప్పుడు చేయడం లేదు. బీజేపీ నేతలు కూడా మౌనం పాటిస్తున్నారు. ఇప్పుడు అన్నా హజారే లాగా ఎవరో ఒకరు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అవినీతిపై ఉద్యమించాల్సిన అవసరం ఉంది. నేపాల్ హింసాత్మక ఘటనలు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. అదొక చిన్న దేశమని ఊరుకోలేం. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకునేలా పాలకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. అప్పులతో ప్రజలను మోసం చేస్తూ, ఉచిత పథకాలతో ఊరేగడం సరికాదు. ఎందుకంటే రాజకీయ నేతలు అధికారం కోసం ఉచిత తాయిలాలు ప్రకటించి అమలు చేయడంతో రాష్ట్రాలు దివాళా తీస్తున్నాయి.

ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల సమస్య కాదు ు దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే. గతంలో కొన్ని కేసుల్లో ఉన్న జగన్ జైలకు వెళ్లి వచ్చాక... బెయిల్‌పై ఉంటూ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారు. నిజానికి మన దేశంలో చట్టాలు సక్రమంగా లేకపోవడం వల్లే రాజకీయ నేరాలకు సకాలంలో శిక్షలు పడడం లేదు. రాజకీయ నాయకులు తాము చేసే అక్రమాలపై సులభంగా తప్పించుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసునే తీసుకుంటే ఎన్నో ఏళ్లుగా అది నడుస్తోంది. నిజానికి కాల పరిమితిని విధించి తీర్పులు వెలువడేలా మన శిక్షాస్మృతిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే కేసుల్లో బెయిల్‌పై ఉన్న వ్యక్తి సీఎం పదవికి తగునా అన్నదీ చూడాలి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, కాళేశ్వరం అవినీతి, విద్యుత్ పేరుతో లెక్కకు అందని అప్పులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో వేల కోట్లు ఊడ్చేశారు. చేపలు, గొర్రెల పంపకంతో కోట్లు మింగారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మహానుభావులు ఇప్పుడు ఈ అవినీతిపై మాట్లాడటం లేదు. కేంద్రంలో పదవులు పొందిన ఇద్దరు మంత్రులు కూడా మాట్లాడటం లేదు. ఇలా నేరాలు చేసే వారంతా మన పాలకులు అవుతూ పోతుంటే ప్రజాస్వామ్యంలో నేర సామ్రాజ్యం రాజ్యమేలుతుంది. దీనికితోడు ఏపీలో అరాచకం, అక్రమాలున్నాయి. హుందా రాజకీయాలను పక్కన పెట్టారు. రాజకీయ నేతలు అవినీతికి పాల్పడితే తాటతీయాల్సిందే. జగన్ పాలనలో జరిగిన ఇసుక, మైనింగ్ మాఫియాలపై చర్యలు తీసుకోవాలి. ఏపీ కావచ్చు... తెలంగాణ కావచ్చు... అవినీతి కేసుల్లో ఎవరు ఉన్నా నిగ్గు తేల్చాల్సిందే. ఇలాంటి సందర్భాల్లో కేంద్రంలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. పాలకులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా విచారణ జరపాల్సిందే. లోక్‌పాల్ బిల్లు తెస్తే తప్ప రాజకీయ నాయకుల ఆటలు కట్టించలేం. రాజకీయ అవినీతిపై ప్రత్యేక కోర్టులు ఉండాలి.

రాజకీయ అవినీతిని అరికడితే తప్ప మన దేశం దరిద్రం తీరదు. చంద్రబాబు కావచ్చు, జగన్ కావచ్చు, కేసీఆర్ కావచ్చు ు అవినీతి ఎవరిది అయినా సత్వర విచారణ జరిపించి బొక్కలో తీయాల్సిందే. పాలకులన్న వారు నిజాయితీగా ఉండేలా మన చట్టాలు ఉండాలి. అక్రమ సంపాదనలపై నిఘా కన్ను వేయాలి. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకురావాలన్న అన్నా హజారే డిమాండ్‌ను ప్రధాని మోడీ పక్కన పెట్టారు. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకురావడంతో పాటు, రాజకీయ నేతల అవినీతి కేసుల్లో త్వరగా విచారణ జరిపి తీర్పులు వచ్చేలా ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేసుకోవాలి. ఏడాదిలోగా ఏ కేసుకైనా విచారణ ముగించి తీర్పు వచ్చేలా వ్యవస్థలను బలోపేతం చేయాలి. కఠిన శిక్షలు అమలు చేయాలి. చైనా లాగ కఠిన శిక్షలు వేస్తూ పోతే తప్ప రాజకీయ అవినీతికి చరమగీతం పాడలేం. కవిత లిక్కర్ స్కామ్‌ను తీసుకుంటే ఈడి, సీబీఐ అధికారులు కేసు నిగ్గు తేల్చలేదు. రాజకీయ పార్టీల నేతలంతా ఒకే తాటిపై ఉండటంతో లోక్‌పాల్ వ్యవస్థను తీసుకురావడం లేదు. అది వస్తే తప్ప రాజకీయ అవినీతికి కళ్లెం పడదు.

# కాంగ్రెస్ పాలనలో ఢిల్లీ యాత్రలు

## పదే పదే సీఎం రేవంత్, మంత్రుల ప్రదక్షిణలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఢిల్లీ పర్యటనలు తప్పవు. ప్రతి చిన్న విషయానికి పదేపదే యాత్రలు చేయాల్సిందే. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీ యాత్రలు చేశారు. ఏ చిన్న పనైనా అధిష్ఠానం అనుమతి తప్పనిసరి. ఫోన్‌లో మాట్లాడేందుకు వీలుండదు. కేవలం వ్యక్తిగతంగా, పరదా చాటునే మాట్లాడాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంలో మాత్రం ఫ్యూడల్ విధానంలోనే కొనసాగుతున్నారు. సీఎంలు సామంత రాజుల్లా ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఇది తప్పడం లేదు. తెలంగాణ రాజకీయ వర్గాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కేబినెట్ విస్తరణ ఇంకా మిగిలే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తున్న ప్రతిసారీ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఆయన ప్రతిసారి చర్చలు జరుపుతున్నారు. అనేక సమస్యలు ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ పెద్దగా ఫలితం కనబడడం లేదు. మంత్రివర్గ విస్తరణ ఇప్పటికీ పూర్తిగా జరగలేదు. హోంమంత్రిత్వ శాఖ, మున్సిపల్, విద్య, మైనింగ్‌తో పాటు పలు కీలక శాఖలు ఇంకా సీఎం వద్దే ఉన్నాయి. కేబినెట్‌లో చోటు కోసం పలువురు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ కేబినెట్ విస్తరణలో పలువురు సీనియర్లు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరామ్ నియామకం అయ్యాక, ఆయనను కేబినెట్‌లోకి తీసుకుంటారని అంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది కీలక పాత్ర. ఆయన లేకుండా ఉద్యమాన్ని ఊహించలేము. అందుకే తొలి ప్రాధాన్యం ఆయనకే ఇస్తారని భావించారు. కానీ అలా జరగలేదు. కోదండరామ్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి స్పష్టత ఉన్నట్లు తెలుస్తోంది. ఇక రేసులో ఉన్న ఇతర నేతల విషయానికి వస్తే రంగారెడ్డి జిల్లాలో నుంచి మల్‌రెడ్డి, నల్గొండ జిల్లాలో నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నేటికీ మంత్రి పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మైనారిటీల కోటా లో షబ్బీర్ అలీ, అజారుద్దీన్ కూడా అమాత్య పదవులను ఆశిస్తున్నారు. వీరిలో ఎవరిని పదవులు వరించనున్నాయన్నదీ చూడాల్సిందే.

# పదునెక్కుతున్న హైడ్రా కోరలు

## ఆక్రమణదారుల్లో గుబులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** రాష్ట్రంలో హైడ్రా దూసుకుపోతోంది. ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఎంతటి విమర్శలు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు చేసింది కొంతే అయినా, హైడ్రా పనితీరుకు ప్రజల్లో మంచి పేరు వస్తోంది. ఆక్రమణలు కూల్చాల్సిందేనని ప్రజలు అంటున్నారు. రాజకీయ నాయకులు, రియల్టర్ల ఆక్రమణలను తొలుత కూల్చాలని కోరుకుంటున్నారు. నాలాలను ఆక్రమించిన వారు ఎవరైనా ఊరుకోకూడదని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికే వందల కోట్ల విలువైన ఆస్తిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. పార్కులను మింగిన వారి నుంచి భూములను లాక్కుంది. జంటనగరాల్లో హైడ్రా వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో మూసీ డెవలప్‌మెంట్‌పై సీఎం రేవంత్ దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా, మూసీ ఆక్రమణలపై హైడ్రా దృష్టి పెట్టనుందని అంటున్నారు. మూసీ ఆక్రమణల తొలగింపు హైడ్రా తదుపరి లక్ష్యంగా ఉంది. మూసీ వైపు హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్లనున్నాయి. మూసీలో ఇళ్లను నిర్మించిన వారిపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. మూసీ ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. గత 15 ఏళ్లలో మూసీ ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో భారీగా నిర్మాణాలు వెలిశాయి. ఇప్పటికే చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ ప్రాంతాల్లో మూసీ ఆక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ అయ్యాయి. అర్హులైన బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. మూసీ ఆక్రమణలపై ప్రభుత్వానికి హైడ్రా సమగ్ర నివేదికను అందజేసినట్లు తెలుస్తోంది. మూసీలో 10 వేలకు పైగా ఇళ్లు ఉన్నట్లు రెవెన్యూశాఖ అధికారులు గుర్తించారు. అలాగే కొందరు మూసీలో మట్టి నింపి ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించారు. గండిపేట నుంచి నాగోల్ వరకు అనేక చోట్ల ఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైడ్రాను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ స్థలాల సంరక్షణ, చెరువులు, నాలాలు, కుంటలపై ఆక్రమణలను తొలగించేందుకు, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అన్ని సర్వాధికారాలను హైడ్రాకు అప్పగించారు. రెవెన్యూ ఆక్రమణల నిరోధం చట్టంపై కలెక్టర్ల నుంచి కిందిస్థాయి వరకు ఉన్న అధికారాలను హైడ్రాకు అప్పగించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఇక హైదరాబాద్‌లో ఆక్రమణలపై హైడ్రా మరింత దూకుడు ప్రదర్శించనుంది. మూసీ పరివాహకం శుభ్రమవుతుంది. అలాగే చెరువులకు విముక్తి దక్కనుంది.

# మేడారం మహాజాతరకు భారీగా ఏర్పాట్లు

## భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు : సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 10 :** మేడారం మహాజాతరకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇందుకు అసవరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి సీతక్క అన్నారు. మరింత ఘనంగా జాతర నిర్వహించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం అభివృద్ధిని విస్మరించారని, కానీ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ముందుగానే జాతరకు ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి పనులను స్వయంగా సమీక్షిస్తున్నారని సీతక్క అన్నారు. మేడారం గద్దెల దగ్గర మార్పులు చేస్తున్నట్లు- తెలిపారు. తాము, పూజారులు చేసిన మార్పులపై సీఎం రేవంత్ సంతృప్తి చెందలేదని.. అందుకే ఆయనే స్వయంగా గద్దెల దగ్గరకు వస్తున్నారని వివరించారు. ఈ నెల 13న లేదా 14న సీఎం మేడారం పర్యటనకు వస్తారని తెలిపారు. అయితే, గద్దెల మార్పుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజారులు, భక్తుల మనో భావాలు దెబ్బతినకుండా మార్పులు చేస్తామన్నారు. మేడారం జాతరపై రాజకీయం చేయవద్దని, భక్తి భావంతో చూడాలని సూచించారు. మహాజాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మార్పులు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు ఉంటాయని అన్నారు.

# ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు

## మంత్రి వివేక్ స్పష్టీకరణ



**సిరిసిల్ల, సెప్టెంబర్ 10 :** ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సిరిసిల్లలో జరిగిన సకలజనుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ు "కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం కట్టారు, అదే వారి హయాంలో కూలిపోయింది," అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. సాగునీటి విషయంలో కేటీఆర్‌కు కనీస అవగాహన లేదని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచే గోదావరి నీటిని హైదరాబాద్‌కు తరలిస్తాం" అని వెల్లడించారు. కేసీఆర్ కుటుంబంపై కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "అమరుల త్యాగాల వలననే తెలంగాణ వచ్చిందని, యువకుల బలిదానాలను చూసి చలించిపోయిన సోనియాగాంధీ రాష్ట్రం మంజూరు చేశారు" అని గుర్తుచేశారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు లక్ష రూపాయలు అందించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో ఇసుక మాఫియా వేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు నైపుణ్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, కల్వకుంట్ల కుటుంబం ఖజానా ఖాళీ చేసినా, సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాల భర్తీ కొనసాగుతోందన్నారు. సిరిసిల్లలో జౌళి శాఖ కార్మికులకు న్యాయం జరగాలని కోరుతున్నామని, వారికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. "ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంటులో కాక్ స్ఫూర్తితోనే పోరాడాం" అని అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



# టిటిడి ఈవోగా సింఘాల్ బాధ్యతలు

## రంగనాయక మంటపంలో వేదాశీర్వచనం

**తిరుమల, సెప్టెంబర్ 10 :** టిటిడి ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమల చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ఈవోగా ప్రమాణం చేశారు. రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలిచ్చారు. అనిల్ సింఘాల్‌కు అదనపు ఈవో వెంకయ్య చౌదరి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. రెండోసారి ఈవోగా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. కాలినడక మార్గంలో వస్తున్నప్పుడు భక్తులు కొన్ని సమస్యలు దృష్టికి తెచ్చారని తెలిపారు. వాటిని పరిష్కరించి మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమల పవిత్రతను కాపాడాలని సిఎం చంద్రబాబునాయుడు తనకు సూచించారన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఆయన సూచనల మేరకు తన సేవలను విస్తృతం చేస్తానని, సామన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇదిలావుంటే బదిలీ అయిన ఈవో శ్యామలరావుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. పూర్వ జన్మ సుకృతం ఉంటే తప్ప తితిదే ఈవోగా పనిచేసే భాగ్యం కలగదన్నారు. తనకు ఈవోగా పనిచేసే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 14 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాబోయే 25 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు, అభివృద్ధి చేపట్టినట్లు- వివరించారు. బోర్డు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

## తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చనిసూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: 91 9949351270. పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.



# బంగారం ధరలు పైపైకి..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :** బంగారం కొనాలనుకునే వారికి వంసగా షాక్ తగులుతోంది. బంగారం ధర ఆల్-టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,10,300కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ.1,01,100కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 10, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 01, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 10, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు- రూ.1,01,100కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లలో స్వల్ప మార్పులు ఉన్నా పెద్దగా తేడాలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



## వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో
# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్ర పటానికి వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుదీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డి ఆర్ ఓ మంగి లాల్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి , జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# గ్రామ వ్యవస్థ కుంటుపడిపోయింది

- స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి..
- సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు



**ఖమ్మం జిల్లా బ్యూరో రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న గ్రామంలో సర్పంచులు లేక గ్రామాలలో పరిపాలన అస్తవ్యస్తమైందని అన్నారు. గ్రామ పంచాయితీకి వచ్చే నిధులు రాక గ్రామ వ్యవస్థ కుంటుపడిపోయిందని తెలిపారు. గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పాలన ఏర్పడిన తర్వాత ఎవరికి ఏం చెప్పాలో తెలియని స్థితిలో గ్రామ ప్రజలు ఉన్నారని తెలిపారు.గ్రామ పంచాయితీ కార్యదర్శుల పై భారం పడడంతో అప్పుల బాధ పడుతున్నారని అన్నారు . నిధులు లేక గ్రామలలో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు లేక, గ్రామలలో వీధిలైట్లు కొరత, పారిశుద్ధ్యం కొరత ఎక్కువగా ఉన్నదని అన్నారు. ఇప్పటి వరకు ఎలక్షన్ జరుగక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తెలంగాణ గ్రామ పంచాయితీ ఎలక్షన్ లను జరిపి గ్రామాలలో అభివృద్ధి పదంలో నడిపింకుంట వారు కోరారు.



## చాకలి ఐలమ్మ జీవితం
# నేటి యువతకు ఆదర్శం

### నేలకొండపల్లి మండల బిజెపి అధ్యక్షులు పాగర్తి సుధాకర్

**ఖమ్మం జిల్లా బ్యూరో రాజముద్ర న్యూస్ సెప్టెంబర్ 10 :** నేలకొండపల్లి మండల బిజెపి అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతు, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ నిజాం నవాబుకూ, ఆయన తొత్తులైనభూస్వాములకూవ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో వారి పోరాట ఫలితం అని గుర్తు చేశారు.. 1895 సెప్టెంబర్ 26న నాడు వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో ఆమె జన్మించింది. చిన్న వయస్సులో పాలకుర్తికి చెందిన నర్సయ్యతో వివాహం అయింది అని అన్నారు. పాలకుర్తి పరిసరాల్లో మల్లంపల్లి దొరవద్ద కొంత భూమిని ఐలమ్మ కుటుంబం కౌలుకు తీసుకొని సాగు చేసింది. ఇది పాలకుర్తి విస్నూర్ గ్రామానికి చెందిన దేశముఖ్ రేపాక రామచంద్రారెడ్డికి కోపం తెప్పించింది. దొర గడీల్లో వంతుల వారీగా వెట్టి చేసే ఐలమ్మ కుటుంబం సొంతంగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకోవడం సహించలేక పోయాడు. ఐలమ్మ భూమిని కాజేయాలనీ, ఆమె పండించిన పంటను గూండాలతో కొల్లగొట్టించాలనీ చూశాడు. ఐలమ్మ గ్రామ స్థుల సహకారంతో పంటను తరలించుకు పోవడానికి వచ్చిన గూండాలను తరిమి కొట్టింది. ఐలమ్మ సాధించిన ఈ విజయం అన్నారు.. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా నాయకులు మన్నే కృష్ణారావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ప్రచార కార్యదర్శి సురేపల్లి జ్ఞాన రత్నం మండల నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన వెంకటరమణ, కళ్యాణం నాగేశ్వర్ రావు, కొండా హర్ష వర్ధన్,పిట్టల సూరిబాబు, గెల్లా నాగసాయి, దేశబోయిన వేణు బాబు గుండెపోంగు క్రాంతి, కందరబోయిన గోపి, మూడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బంటు కృష్ణను పరామర్శించిన రామకృష్ణ బొలిశెట్టి మధు, బావ్ సింగ్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఇండియన్ జర్నలిస్ట్ ఇండియన్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు మాతృమూర్తి బంటు బుచ్చమ్మ ఈనెల 3వ తారీఖున మరణించారు. బుధవారం బంటు బుచ్చమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించి బంటు కృష్ణను, కుటుంబ సభ్యులను పరామర్శించిన సీనియర్ డాక్టర్ రామకృష్ణ,బీఆర్ఎస్ నాయకులు బొలిశెట్టి మధు,బావ్ సింగ్,నాని మొబైల్స్ అధినేత దేశోజు రవీంద్ర చారి( నాని), మహంకాళి శివ, పర్వతం భరత్,అన్నారం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన
# పౌష్టికాహారం అందించాలి

### రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం కోట్ పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్వాడి, చౌక ధర దుకాణాలను కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్ లతో కలిసి రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌక ధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన వివరాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు సిబ్బందిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన ప్రజలు మండల కేంద్రంలో 24 గంటలపాటు వైద్య సేవలు ఉండాలని అదేవిధంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కమిషన్ చైర్మన్ పర్యటనలో డిఆర్డిఏ శ్రీనివాస్, డిఇఓ రేణుకా దేవి, డీఎంహెచ్ఓ లలితా దేవి, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడలో అంగరంగ వైభవంగా
# గణేష్ శోభయాత్ర

- 68 కిలోల గణనాధుని లడ్డును రూ. 1,10,000/- సొంతం చేసుకున్న మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి దంపతులు
- చిన్న లడ్డును రూ. 60 వేలకు వేలంలో దక్కించుకున్న పబ్బతి సాయిరాం


**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కమలానగర్ కాలనీలో యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమర్జనం సందర్భంగా నిర్వహించిన శోభయాత్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. డప్పు చప్పుళ్ళు, మంగళ వాయిద్యాలతో, ఊరంతా ఉత్సాహంగా పాల్గొని కన్నుల పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి హాజరై, లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి స్వయంగా బహుమతులు అందజేశారు. 68 కిలోల లడ్డూను రూ. 1,10, 000/- లకు జక్క వెంకట్ రెడ్డి కైవసం చేసుకోగా, చిన్న లడ్డూను రూ. 60,000/- లకు పబ్బతి సాయిరాం సొంతం చేసుకున్నారు. శాలువాను రూ. 20,000 /- చిందం రామస్వామి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, బోయిన్పల్లి దగడు సాయి, వెంకన్న గౌడ్, శ్యామల సాయిలు, నర్సింహా, ఆంజనేయులు, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు, యువత కమిటీ సభ్యులు, స్థానిక వాసులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

## పారదర్శకంగా గ్రామ పరిపాలనా
# అధికారుల కౌన్సిలింగ్

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 10 :** పైరవీలకు, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా మెరిట్ పద్ధతిలో గ్రామ పరిపాలనా అధికారులకు కౌన్సిలింగ్ చేపట్టి, పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పరిపాలనా అధికారులకు నిర్వహించిన కౌన్సెలింగ్ కు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి ప్రభుత్వం గ్రామాల్లో గ్రామ పరిపాలనా అధికారులను నియమించిందని అన్నారు. జిల్లాలోని 299 క్లస్టర్లలో గ్రామ పరిపాలనా అధికారుల నియామకానికి కౌన్సిలింగ్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో పరీక్ష ద్వారా 252 మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి స్వంత మండలం మినహాయించి, ఇతర ప్రదేశాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు పోస్టింగులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజావాణి లో, గ్రామాల సందర్శన సందర్భంగా ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించే బాధ్యత మనపై ఉందన్నారు. భూ భారతి చట్టం పటిష్ట అమలుకు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, జిల్లా యంత్రాంగం నుండి సహకారం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం సర్వీస్ రూల్స్ నోటిఫై చేస్తుందని, ప్రమోషన్లు, అన్ని ఫలాలు ఇవ్వనుందని కలెక్టర్ అన్నారు. పోస్టింగ్ ఎక్కడ వచ్చిన మంచి పని చేస్తే గుర్తింపు వస్తుందని, మంచిగా పనిచేస్తున్న వారిని ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## జిల్లాలో అభివృద్ధి పనులు
# వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 10 :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, అవసరమైన వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం అర్బన్ పరిధిలోని బల్లెపల్లిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మితమవుతున్న నూతన మెడికల్ కళాశాల భవనం, మెడికల్ కళాశాల విద్యార్థుల (బాలబాలికలు), ప్రొఫెసర్ల వసతి గృహాలు, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్య కళాశాలలో కావాల్సిన వసతుల ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుసంధానం రోడ్డులు, ప్రహరీ గోడ, ప్రధాన రహదారిలో ఆర్చ్ ఏర్పాటు ను చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన మెడికల్ కళాశాల భవనం, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. అంతకు ముందు ఖమ్మం నియోజకవర్గం కు కేటాయించిన యంగ్ ఇండియా స్కూల్ ప్రతిపాదిత స్థలం ను అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ మ్యాప్ లను, నిర్దేశిత స్థలం ను మొత్తం తిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సూమరు 21 ఎకరాల భూమిలో 3000 మంది విద్యార్థులకు అనువైన అధునిక వసతులతో చేపట్టిన నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యలో సమూలమైన విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వస్తాయని, పేదపిల్లల బంగారు భవిష్యత్తుకు నాణ్యమైన నిర్మాణ పనులను పూర్తి చేసి సకాలంలో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. త్వరితగతిన వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి పిల్లలకు అందుబాటులో తీసుకురావాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇఇ పవార్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దారు సైదులు, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా మంద సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

- మాజీ జెడ్పిటిసి మంద సంజీవరెడ్డి జన్మదిన పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఘట్కేసర్ మాజీ జెడ్పిటిసి మంద సంజీవ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మైనారిటి నాయకులు అబ్దుల్ అలీం, మొహమ్మద్ తాజుద్దీన్, అలీ, పాషా, ఖలీల్, వహీద్, అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద సంజీవ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడే నాయకుడని బోడుప్పల్ పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.



# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో భూ పోరాటాలు చేద్దాం

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** చాకలి ఐలమ్మ స్ఫూర్తితో భూ పోరాటాలు చేయాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. భూమి,భుక్తి,విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ చిట్యాల (చాకలి) ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడ కుడ లెనిన్ నగర్ లో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం ఎర్ర జెండా పట్టి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కొంగు నడుముకు చుట్టి,రోకలిగొండ చేతబట్టి తన భూమిని కాపాడుకునేందుకు కమ్యూనిస్టుల సాయంతో విసునూరు దొర రామచంద్రారెడ్డిని ఆయన అనుచరులని ఉరికించుకుంటూ కొట్టిన వీర నారీమణి చిట్యాల ఐలమ్మ అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని సూర్యపేట జిల్లాలో కొనసాగిస్తూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెలికిదీసి నిరుపేదలకు సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతి పంచుతామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ భూములు మెంత్తం కబ్జాకు గురయ్యాయి అని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కబ్జాకు గురైన భూములను వెలికితీసి పేదలకు పంచుతామని హామీ ఇచ్చారు కానీ ఈరోజు వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు అన్నారు. మా పోరాట ఫలితంగా కుడ కుడ 126 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో కబ్జాదారులను కలెక్టర్ ఖాళీ చూపించారు అన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెలికితీసి ప్రభుత్వ అవసరాలకు లేదా పేదలకు ఉపయోగపడేలా పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, పిఓడబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి సంతోషి మాత,కోశాధికారి మోటకట్ల జయమ్మ,టియుసీఐ నాయకులు పుప్పాల అంజయ్య,గంట జలేందర్, బాలస్వామి, ఐతరాజు పద్మ,గౌరమ్మ,రహమతి,మీనాక్షి, పద్మ, పర్వీన్,శ్రీదేవి పాల్గొన్నారు.



## సీనియర్ జర్నలిస్ట్ బంటు కృష్ణ
# కుటుంబానికి పరామర్శ

**మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** జీవించి ఉన్న కాలంలోనే కాకుండా మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడటం అనేది చాలా గొప్ప విషయమని, ప్రతివారు అభినందించే పరిణామమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది డాక్టర్ బంటు కృష్ణ మాతృమూర్తి బంటు బుచ్చమ్మ ఇటీవల మరణించిన సందర్భంగా బుధవారం బంటు కృష్ణ స్వగృహంలో కృష్ణతోపాటు ఆయన కుటుంబాన్ని జగదీష్ రెడ్డి పరామర్శించారు. బంటు బుచ్చమ్మ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ కాలక్రమంలో మానవుని మనస్తత్వంలో వస్తున్న మార్పుల ప్రకారం అనేకమంది ఇటీవల తమ కుటుంబ సభ్యులు మరణిస్తే మెడికల్ కళాశాలలకు ఇవ్వడం హర్షణీయం అన్నారు. బంటు బుచ్చమ్మ కు చదువు లేకపోయినప్పటికీ ముందుచూపుతో,ఒక ప్రగతికరమైన ఆలోచనతో తన కుటుంబ సభ్యులకు చెప్పి వైద్య విద్యార్థుల పరిశోధనలకు తన భౌతిక కాయాన్ని అందించేలా చేయడం సమాజంలో మార్పుకు సంకేతం అన్నారు. దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలో పరిశోధన కోసం మృతదేహాల కొరత ఉందని, మానవత్వంతో,చైతన్య స్ఫూర్తితో, ప్రగతికరమైన భావాలతో ఆలోచించేవారు మెడికల్ కళాశాలలకు మృతదేహాలు అందించి మరణానంతరం కూడా తమ శరీరం ఉపయోగపడాలనుకోవటం ప్రశంసించదగ్గ విషయం అన్నారు. తాను,తన భర్త సైదులు చదువుకోకపోయినప్పటికీ తమ కొడుకును డాక్టరేట్ తో పాటు గోల్డ్ మెడల్ సాధించేలా చదివించడం వారి కష్టానికి సార్థకత లభించింది అన్నారు. ఇంకా జగదీశ్ రెడ్డి వెంట బీ ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, లింగమంతుల గట్టు మాజీ చైర్మన్ మద్ది శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, అనంతుల విజయ్, దేశోజు నాని,పర్వతం భరత్,మహంకాళి శివ,పిచ్చయ్య తదితరులు ఉన్నారు.



## బాలికల డిగ్రీ కళాశాల నందు
# సైబర్ నేరాల పట్ల అవగాహన

**సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలో గల బాలికల గురుకుల డిగ్రీ కళాశాల నందు పోలీస్ ప్రజా భరోసా, కార్యక్రమం అవగాహన ఏర్పాటు చేసిన సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య. పోక్సో చట్టం అమలు,జిల్లా పోలీస్ షీ టీమ్స్ పనితీరు,భరోసా సెంటర్ పని తీరు,మహిళల బాలల రక్షణ చట్టాలు,ఉన్నత లక్ష్యాలతో చదువుకోవడం, మంచి అలవాట్లు, వేధింపులపై ఫిర్యాదు చేయడం మొదలు అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకటయ్య మాట్లాడు నేటి సాంకేతిక సమాజంలో అనేక అసాంఘిక దురాచారాలు ఉన్నాయని వాటన్నిటిని చదువు అనే విజ్ఞానంతో ప్రారదొరాలని దానికి ఉన్నతమైన చదువు ముఖ్యమని చదువు విలువ గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకొని విజయాలు సాధించాలని తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. సైబర్ మోసాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మరకతవ్యాలకు యువత బానిసలై బంగారు భవిష్యత్ కోల్పోతున్నారని అలాంటి వాటిని దూరంగా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లా షీ టీమ్స్, భరోసా సెంటర్ సిబ్బంది మహిళా రక్షణలో పనిచేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియా నందు వచ్చే ప్రతి దానికి స్పందించవద్దు అని ఇంటర్నెట్ ద్వారా జ్ఞానాన్ని పొందాలి అన్నారు. వేధింపులకు సంబంధించి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని అన్నారు జిల్లా షీ టీం 8712686056 కు ఫిర్యాదు చేయాలని, డయల్ 100 కు చేయాలని కోరారు.




# చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి

- వీర తెలంగాణ సాయుధ రైతంగా పోరాటన్ని, మతం రంగు పూస్తున్న మతోన్మాదలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారు
- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని సీపీఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో దిల్ ఖుష్ నగర్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సభకు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఈ సత్యం హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటా చరిత్రను మతోన్మాద పార్టీగా మతకోణంలో చూస్తూ మతం రంగు పూస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని, మతోన్మాదులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఐదు సంవత్సరాల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఐదు సంవత్సరాలు జరిగితే నైజాం ప్రభుత్వం చేతిలో మరణించింది 1500 మంది అయితే సర్దార్ వల్లభాయ్ పటేల్ మిలిటరీ చేతిలో 2500 మంది కమ్యూనిస్టు నాయకులు పేద ప్రజలను కాల్చి చంపేశారని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సైన్యం నైజాం సర్కార్ ని ఓడిస్తే ఆ నైజాం రాజుకి రాజు ప్రముఖ్ (ప్రస్తుతం ఉన్న గవర్నర్ లాగ) బిరుదు ఎందుకు ఇచ్చింటే విలీనం అయినట్లేగా చరిత్ర తెలవకుండా, చరిత్ర గురించి మాట్లాడడం మతోన్మాద బీజేపీని ప్రజలు తరిమి, తరిమి కొట్టె రోజులు వచ్చాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, సీపీఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ సభ్యురాలు ఎ. విజయ, మాధవి లత, నవీన, గీత, సువర్ణ, పద్మ, జరీన, రెహానా బేగం, మబ్జాన్, సునీత, నూర్జహాన్, చాన్ బేగం, రమాదేవి, చిన్నమ్మ, ధనుజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్, చైనాలపై
# 100 శాతం సుంకం!

- రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపేస్తామనే వరకు టారిఫ్‌లను కొనసాగించాలి
- ఈయూకు ట్రంప్ సూచన
- అమెరికా సూచనలు అమలు చేసేందుకు సిద్ధం : ఈయూ అధికారులు



**యూఎస్ :** ఉక్రెయిన్ యుద్ధం ముగించే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా భారత్, చైనాలపై సుంకాల భారాన్ని పెంచి రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించాలని ట్రంప్ యూరోపియన్ యూనియన్ (ఈయూ)ను కోరినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించే అంశంపై సీనియర్ అమెరికన్, ఈయూ అధికారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఈయూ అధికారులతో ట్రంప్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడారు. రష్యాపై ఆర్థికఒత్తిడి తీసుకువచ్చేందుకు భారత్, చైనాలపై 100 శాతం సుంకం విధించాలని సూచించినట్లు తెలుస్తోంది. చమురు కొనుగోలు చేయడం ఆపేస్తామనే వరకు ఈ టారిఫ్‌లను కొనసాగించాలన్నారు. 'మేము ఇలా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ, యూరోపియన్ భాగస్వాములతో కలిసి ముందుకువస్తేనే దీన్ని అమలుచేద్దాం' అని యూఎస్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా సూచనలు అమలుచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈసందర్భంగా ఈయూ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఉక్రెయిన్‌లో త్వరగా శాంతి నెలకొల్పాలని ఈయూ కూడా భావిస్తుంది. ఈ క్రమంలో రష్యాపై ఒత్తిడి తెస్తేనే అది సాధ్యమవుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో యూరోపియన్ నేతలు కూడా ఆ దిశగా ఆలోచన మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అయితే భారత్, చైనా వంటి దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధిస్తే నెలకొనే పరిణామాలపై వారు చర్చలు జరుపుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై భారత్, చైనాలపై ట్రంప్ కొన్ని రోజులుగా గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ఇటీవల ఎస్సీవో సమ్మిట్‌కు భారత ప్రధాని మోదీ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తో భేటీ అయ్యి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దీనిపై కూడా ట్రంప్ తన అక్కసును వెళ్లగక్కారు. మరోవైపు.. భారత్‌తో నెలకొన్న వాణిజ్య అడ్డంకులు తొలగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఈసందర్భంగా ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

## ట్రంప్ సుంకాలతో అమెరికా కంపెనీలకు దెబ్బే



**యూఎస్ :** ఆదాయం పెంచుకోవడానికి యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాలపై కొరడా ఝులిపిస్తే.. ఆ దెబ్బ అమెరికా కంపెనీలకే తగులుతోంది. అగ్రరాజ్యానికి చెందిన మెజారిటీ కంపెనీలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే అందుకు కారణం. చైనా నుంచి అత్యధిక సుంకాలు వసూలు చేయాలని వాషింగ్టన్ భావించగా.. బీజింగ్ కూడా తాము తక్కువ తినలేదని ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోనున్నాయని షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో మొత్తం 254 కంపెనీల్లో మూడోవంతు పాల్గొన్నాయి. చైనాలో కొత్త సుంకాల వల్ల తాము అంచనా వేసిన ఆదాయం తగ్గుతుందని అవి పేర్కొన్నాయి. అయితే, బ్యాంకింగ్, కొన్నిరకాల ఇతర పరిశ్రమలు అమెరికాకు ఎటువంటి ఎగుమతులు, దిగుమతులు చేయడం లేదు. ఇలాంటి కంపెనీలు దాదాపు మూడింట ఒక వంతు ఉన్నాయని తెలిసింది. వీటిపై మాత్రమే టారిఫ్‌ల భారం ఉండదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా దిగుమతులపై తొలుత అదనంగా 30 శాతం సుంకాలు విధించారు. తర్వాత వాటిని 145 శాతానికి పెంచారు. దీనిపై డ్రాగన్ కూడా దీటుగా స్పందించడంతో పరస్పర సుంకాలపై వెనక్కి తగ్గాలని ఇరు దేశాధినేతలు మేలో నిర్ణయించుకున్నారు. దీంతో చైనా 10 శాతం సుంకాలతో సరిపెట్టింది. నూతన టారిఫ్‌ల ప్రభావం చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే కంపెనీలు, అగ్రరాజ్యం నుంచి కొన్ని రకాల ముడిసరకు దిగుమతి చేసుకొనే కంపెనీలపై పడింది. వీటిలో ముఖ్యంగా రసాయన కంపెనీలు ఉన్నాయని షాంఘై ఛాంబర్ లీడర్స్ తెలిపారు. 'సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి' అని ఆ బృంద అధ్యక్షుడు ఎరిక్ షెంగ్ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. సుంకాలు, ఇతర అంశాలపై ఏవిధంగా ముందుకెళ్తున్నారనే విషయంపై స్పష్టత రావడం లేదు. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన కంపెనీలకు ఈ అనిశ్చితి ఒక సవాలుగా మారిందని జెంగ్ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ చట్టాల ఆధారంగా సుంకాలు విధిస్తున్నారని, అవి చెల్లుబాటు కావని ఇప్పటికే పలు కోర్టులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. ఈ తీర్పులపై ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# ట్రంప్ డబుల్ గేమ్..

**దాడి మొదలైన తర్వాత అమెరికా నుంచి ఫోన్**



**హమాస్ :** హమాస్ నేతలే లక్ష్యంగా ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా చేసిన ప్రతిపాదనపై చర్చలు జరుగుతుండగా ఇది జరగడం గమనార్హం. ఈ దాడికి సంబంధించి అమెరికాకు సమాచారం ఉన్నప్పటికీ.. ఖతార్‌కు దాన్ని చెప్పడంలో ఆలస్యం చేసింది. ఈక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతున్నారనే భావన నెట్టింట మొదలయ్యింది.

### 10 నిమిషాలు ఆలస్యంగా..

ఇజ్రాయెల్ చేసిన ఈ దాడిలో హమాస్ కీలక నేత ఖలీల్ అల్-హయ్యా కుమారుడితో సహా ఆరుగురు మృతి చెందారు. దీని గురించి అమెరికాకు ముందే సమాచారం ఇచ్చామని టెల్అ-వీవ్ చెప్పింది. యూఎస్ కూడా దాన్ని అంగీకరించింది. దాడి గురించి ఖతార్‌కు సమాచారం ఇచ్చామని అగ్రరాజ్యం పేర్కొంది. అయితే, దాడులు మొదలైన 10 నిమిషాల తర్వాత యూఎస్ నుంచి తమకు కాల్ వచ్చిందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికారి పేర్కొన్నారు. పేలుళ్లు జరుగుతుండగా.. అమెరికా అధికారి ఒకరు ఫోన్ చేశారన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి చివరి హెచ్చరికగా యూఎస్ ప్రతిపాదన మేరకే దోహాలో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈక్రమంలోనే ఇజ్రాయెల్ దాడి చేయడం గమనార్హం. కాగా, ఈ సమాచారం ఉన్నప్పుడు ముందుగానే ఎందుకు తెలియజేయలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అమెరికా- ఖతార్ బంధం..

ఇటీవల మిత్రదేశాలతో కూడా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. మిత్ర దేశమంటూనే భారత్‌పై భారీ సుంకాల మోత మోగించారు. తాజా దాడులతో ఖతార్‌కు కూడా ట్రంప్ నుంచి అలాంటి చేదు అనుభవం ఎదురైనట్లు ఉంది. అమెరికా- ఖతార్‌ల మధ్య బంధం ఇటీవల బలపడింది. ఆ దేశ పాలకుల నుంచి విలాసవంతమైన విమానాన్ని అధ్యక్షుడు బహుమతిగా అందుకున్నారు. ఇక, ఆ దేశ పర్యటనలో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పశ్చిమాసియాలో తన దౌత్య ప్రయత్నాలకు ఈ గల్ఫ్ దేశం కీలకపాత్ర పోషిస్తోంది. హమాస్- ఇజ్రాయెల్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. దీంతో అమెరికా మిత్రదేశంపై ఇజ్రాయెల్ దాడి చేయడమనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ దాడులకు సంబంధించి అమెరికా స్పందించిన తీరు గందరగోళానికి దారితీస్తుంది. వైట్ హౌస్ ప్రతినిధి కరోలిన్ లీవిట్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ దాడి గురించి తెలియజేయాలని పశ్చిమాసియా రాయబారి విట్కాఫ్‌ను ట్రంప్ ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. దాడి గురించి ముందే చెప్పామంటూ హడావుడిగా వివరణ ఇచ్చారు. అనంతరం దాడికి సంబంధించిన నిర్ణయం తాను తీసుకోలేదంటూ పోస్టు పెట్టారు. మరోసారి ఇలాంటి దాడులు జరగవని హామీ కూడా ఇచ్చారు. ఈ దాడి పూర్తిగా తమ చర్యేనని, ఇందులో యూఎస్ ప్రమేయం లేదంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టంచేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఖతార్‌కు ట్రంప్ ద్రోహం చేశారంటూ నెట్టింట పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.



# నేపాల్‌లో ఆర్మీ కర్ఫ్యూ..

**భారత సరిహద్దులో హై అలర్ట్**

**నేపాల్ :** జెన్-జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ బుధవారం నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న భారత్.. సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా పెల్లుబికిన ఆందోళనల తీవ్రతకు కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దాంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు పరిస్థితులను చక్కదిద్దేందుకు ఆర్మీ బాధ్యతలు తీసుకుంది. ఈ క్రమంలో సైనికులు రాజధాని కాఠ్‌మాండూ వీధుల్లో పహారా కాస్తున్నారు. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. నిరసనకారులు చర్చలకు రావాలని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్ పిలుపునిచ్చారు. ఈ కర్ఫ్యూ వేళ.. విధ్వంసం, దోపిడీ, దాడులు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేపాల్ ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో మన దేశం భద్రతను పెంచింది. "భారత్-నేపాల్ సరిహద్దులో హై అలర్ట్ జారీ చేశాం. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర సాయుధ పోలీసు దళం సహస్త్ర సీమా బల్ భద్రతను పర్యవేక్షిస్తోంది" అని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు మూగబోయాయి. తమ రోజువారీ జీవనానికి ఆటంకం ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### జెన్-జడ్ డిమాండ్లు..

ఈ యువతరంగం నేపాల్ పాలనలో సమూల మార్పులు ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా కొన్ని డిమాండ్లను ముందుంచింది. "ఈ ఉద్యమం ఒక పార్టీ, ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే శాంతి నెలకొంటుంది. అధ్యక్షుడు, నేపాల్ సైన్యం మా ప్రతిపాదనలను సానుకూలంగా అమలుచేస్తుందని భావిస్తున్నాం" అని ఓ ప్రకటనలో వారు పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. అలాగే ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు, వలసలు అరికట్టేందుకు, సామాజిక అన్యాయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వీరి బృందం ఆర్మీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడిని కలవనుంది.



# ఎక్కడ చూసినా మంటలే..

**కర్రలతో నా వెనకే వచ్చారు**

**నేపాల్‌లో భారత టూరిస్ట్ ఆవేదన**

**నేపాల్ :** నేపాల్‌లో జెన్-జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఆందోళనకారులు నిప్పటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. "నా పేరు ఉపాసన గిల్. వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చాను. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారు" అని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. "వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారు" అని పేర్కొన్నారు.

ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది. సాయంత్రం ఐదు గంటల వరకు దేశవ్యాప్తంగా కర్ఫ్యూ కొనసాగనుంది

# ఐటీ, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు

## లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** భారత్– అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్న ట్రంప్ ప్రకటన మన మార్కెట్‌కు బూస్ట్ ఇచ్చింది. త్వరలోనే ప్రధాని మోదీతో సంభాషిం చాలని అనుకుంటున్నట్లు ఆయన సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్ట్.. మదుపర్లలో ఉత్సాహం నింపింది. దీంతో ఇరుదేశాల మధ్య త్వరలో వాణిజ్యఒప్పందం కుదురుతుం దన్న అంచనాలతో నేడు మన మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. సెన్సెక్స్ ఉదయం 81,504.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,101.32) ముగిసింది. ఇంట్రాడేలో 81,235.42–81,643.88 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఓ దశలో 25 వేల మార్కు దాటి చివరికి 104.50 పాయింట్ల లాభంతో 24,973.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.10గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3654 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# అర్బన్ కంపెనీ ఐపీఓ..

## గంటల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్

**ఢిల్లీ:** యాప్ వేదికగా హోమ్ సర్వీసెస్ అందించే అర్బన్ కంపెనీ ఐపీఓకు ఊహించని రీతిలో స్పందన వచ్చింది. మంగళవారం బిడ్డింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 12.45 గంటల సమయానికి 10,67,73,244 షేర్లకు గానూ.. 13,54,38,410 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా 1.27 రెట్ల స్పందన నమోదైంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 3.84 రెట్లు, ఎన్ఐఐ కోటా 1.67 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కేటగిరీ 20 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యింది. రూ.1900 కోట్లు సమీకరించేందుకు ఐపీఓకు వచ్చిన అర్బన్ కంపెనీ.. ఈనెల 12 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. ధరల శ్రేణిని రూ.98–103గా కంపెనీ నిర్ణయించింది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.854 కోట్లు సమీకరించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో రూ.1428 కోట్ల విలువైన షేర్లను విక్రయిస్తుండగా.. రూ.472 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేసింది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను టెక్నాలజీ డెవలప్‌మెంట్‌కు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు, కార్యాలయాలకు లీజు చెల్లింపులు, మార్కెటింగ్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది.



# మందగమనంలో అమెరికా ఆర్థికవృద్ధి

## ద్రవ్యోల్బణంపై ఫిచ్ వార్నింగ్

అమెరికా ఆర్థికవ్యవస్థ అంతర్లీనంగా మందగమన సంకేతాలు చూపిస్తోందని ఫిచ్ రేటింగ్స్ హెచ్చరించింది. ఉద్యోగాల వృద్ధిలో క్షీణత, వినియోగంలో తగ్గుదల, అధిక సుంకాలతో పుట్టుకొస్తున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు అందుకు కారణమని పేర్కొంది. తాజా ఆర్థిక డేటా ఈవిషయాన్ని ధ్రువీకరిస్తోందని తెలిపింది. 'అమెరికాలో మందగమనానికి ఆధారాలు ఇప్పుడు హార్డ్ డేటాలో కనిపిస్తున్నాయి. సెంటిమెంట్ సర్వేలలో మాత్రమే కాదు' అని ఫిచ్ చీఫ్ ఎకనామిస్టు బ్రియాన్ కౌల్టన్ పేర్కొన్నారు. అమెరికా సుంకాల విధానంపై ఇటీవల వెలువడిన వివరణ అనిశ్చితిని తొలగించినప్పటికీ.. అత్యధిక సుంకాలు ప్రపంచ వృద్ధి రేటు, అమెరికా ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిస్తాయని ఫిచ్ హెచ్చరించింది. అమెరికా ఆర్థికవ్యవస్థ వినిమయం తగ్గడం, ఉద్యోగాల క్షీణత, సుంకాల షాక్‌ల పరిణామాలు ఎదుర్కొంటోంది. ఇప్పటివరకు లాభాలపై పరిమితులు మాత్రమే కనిపించినప్పటికీ ఈ సంవత్సరం చివరికి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 'అధిక ద్రవ్యోల్బణం నిజ వేతన వృద్ధి రేటు తగ్గిస్తుంది. యూఎస్ వినియోగదారుల ఖర్చులపై ప్రభావం చూపిస్తుంది. 2025లో ఇప్పటికే గణనీయంగా మందగమనం కనిపిస్తోంది. ఉద్యోగాల వృద్ధి కూడా భారీగా తగ్గింది. వలసల కట్టడి ప్రభావం శ్రామికశక్తి పెరుగుదలలోనూ ప్రతిబింబిస్తోంది' అని ఫిచ్ తెలిపింది.

పెరుగుతున్న ఆర్థికలోటు 2026లో డిమాండ్‌కు మద్దతివ్వాల్సి ఉంది. కానీ, అమెరికా వార్షిక సగటు జీడీపీ వృద్ధి రేటు వచ్చే ఏడాది 1.6 శాతం కంటే తక్కువ ఉంటుందని ఫిచ్ అంచనా వేస్తోంది. ఫెడరల్ రిజర్వ్ త్వరగా రేట్లు తగ్గిస్తుందని ఈ ఏజెన్సీ భావిస్తోంది. సెప్టెంబర్, డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్లు ఉండొచ్చని అంచనా వేస్తోంది. ఇక, సుంకాలు ఉన్నప్పటికీ చైనా ఎగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఆర్థిక సడలింపులు, కరెన్సీ విలువ తరుగుదల అందుకు దోహదపడినట్లు వెల్లడించింది. ద్వితీయార్థంలో యూరోజోన్ వృద్ధి నెమ్మదించనుంది. అమెరికా, యూకే, జర్మనీ, జపాన్‌లలో దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్ల పెరుగుదల కూడా ఒత్తిడి ఎదుర్కొంటోందని ఫిచ్ వెల్లడించింది. భారత వృద్ధి అంచనాలను కూడా ఫిచ్ సవరించింది. జూన్‌లో 6.5 శాతంగా పేర్కొనగా.. దానిని 6.9కి మార్చింది. దేశీయ డిమాండ్ వృద్ధికి ఇది చోదక శక్తిగా పని చేస్తుందని అభిప్రాయపడింది.






# ఆసియాకప్‌లో పోటీ ఉంటుందా..

## దక్షిణాఫ్రికానైనా చేరిస్తే బాగుండేది : అశ్విన్

ఆసియా కప్ 2025 ఎడిషన్ మొదలైంది. తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌పై అఫ్గానిస్థాన్ భారీ విజయం సాధించింది. అయితే, ఈ టోర్నీపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అసలుసిసలైన పోటీ ఎక్కడ? అంటూ ప్రశ్నించాడు. ఆసియా కప్ ప్రమాణాలు పడిపోతున్నాయంటూ అశ్విన్ వ్యాఖ్యానించాడు. టీ20 ప్రపంచకప్ 2026కు సన్నాహకంగా ఈ ఆసియా కప్‌ను అనుకోవడం సరైంది కాదని పేర్కొన్నాడు. ఆసియా కప్‌లో కనీసం భారత్ జట్టును లేదా సౌతాఫ్రికానైనా జత చేస్తే బాగుండేదని సూచించాడు. "ఆసియా కప్ టోర్నీని మరింత ఆసక్తికరంగా మార్చాలంటే చాలా మార్పులు చేయాలి. ఈ ఎడిషన్‌లో దక్షిణాఫ్రికాను చేర్చి ఆఫ్రో–ఆసియా కప్‌గా నిర్వహిస్తే బాగుండేది. కనీసం భారత్ టీమ్‌ను అదనంగా బరిలోకి దింపినా పోటీ బాగుంటుంది. బంగ్లాదేశ్ గురించి ఎక్కువగా మాట్లాడలేం. ఆ జట్టులో పెద్దగా ఏమీ లేదు. ఇతర జట్ల సంగతి సరేసరి. ఇవన్నీ భారత్‌కు ఎలాంటి పోటీనివ్వగలవు? చాలామంది అనుకున్నట్లుగా వచ్చే ఏడాది పొట్టి కప్ కోసం సన్నద్ధమయ్యేందుకు ఈ టోర్నీ కీలకం కాదు. ఇందులో పెద్ద పోటీనే ఉండదు. అఫ్గానిస్థాన్ బౌలింగ్‌ను చూశాక నాకు అదే అనిపించింది. ఒకవేళ భారత్‌తో మ్యాచ్‌లో 170o పరుగుల లక్ష్యం ఎదురైతే అఫ్గాన్ ఛేదించగలదా? అసాధ్యం అనుకుంటున్నా. టీమ్‌ఇండియాను ఓడించాలంటే ఏ జట్టుకైనా ఆ రోజు బాగా కలిసిరావాలి. టీ20ల్లో చివరివరకూ థ్రిల్లింగ్‌గా జరుగుతాయి. కానీ, ఆసియా కప్‌లోనూ భారత్ మ్యాచులు ఏకపక్షమే" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

### టీమ్‌ఇండియానే ఫేవరెట్ : ఉతప్ప

చిన్న జట్టుతో మ్యాచ్‌నైనా సరే తేలిగ్గా తీసుకోవద్దని టీమ్‌ఇండియాకు రాబిన్ ఉతప్ప సూచించాడు. "ఆసియా కప్‌లో ప్రతి మ్యాచ్ కీలకమే. చిన్న జట్లే కదా అని తేలిగ్గా తీసుకోకూడదు. మంచి ప్లేయర్లూ కొన్నిసార్లు నెమ్మదించే ఆస్కారం ఉంది. మనం ఆధిపత్యం ప్రదర్శిస్తాం కదా.. కాస్త రిలాక్స్ అవుదామని ఎప్పుడూ అనుకోకూడదు. ఇప్పుడు జట్టులో ఆరోగ్యకరమైన పోటీ ఉంది. ఇందులోనుంచే రాబోయే టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు అవకాశం ఉంది. జట్టు వాతావరణాన్ని ప్రశాంతంగా ఉంచాలి" అని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప తెలిపాడు.

### ఆప్షనల్ ట్రైనింగ్‌కు ఆ ఇద్దరూ దూరం..

ఇవాళ యూఏఈతో భారత్ తలపడనుంది. మంగళవారం టీమ్‌ఇండియా ప్లేయర్లకు ఆప్షనల్ ట్రైనింగ్ సెషన్ జరిగింది. ఇందులో పాల్గొనడం ఆటగాళ్ల ఇష్టం. జస్‌ప్రీత్ బుమ్రా, సంజుశాంసన్ మిస్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. హర్షిత్ రాణా కూడా బ్రేక్ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మరోవైపు ఓపెనర్లుగా వస్తారని భావిస్తున్న శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ నెట్స్‌లో చెమటోడ్చారు. స్థానిక నెట్ బౌలర్ వేసిన బంతిని ఎదుర్కోబోయి గిల్ క్లీన్‌బౌల్డ్ అయినట్లు సమాచారం. అభిషేక్ తన దూకుడును కొనసాగిస్తూ.. సిక్స్‌లు ప్రాక్టీస్ చేశాడని క్రికెట్ వర్గాలు తెలిపాయి. సుమారుగా 30 సిక్స్‌ల వరకూ బాదినట్లు తెలుస్తోంది.




# యూఏఈపై టీమ్‌ఇండియా

# ఘన విజయం

ఆసియా కప్ టీ20 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. యూఏఈతో ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ జట్టు 13.1 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 4.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అభిషేక్ శర్మ 30(16 బంతుల్లో 3 సిక్సులు, 2 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ 20(9 బంతుల్లో ఒక సిక్స్, రెండు ఫోర్లు) చెలరేగారు. 3.5 ఓవర్‌లో అభిషేక్ శర్మ క్యాచ్ ఔట్ కాగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (7) నాటౌట్‌గా నిలిచాడు. యూఏఈ జట్టులో ఓపెనర్ అలీషాన్ షరాఫు 22(17) టాప్ స్కోరర్. కెప్టెన్ మహమ్మద్ వసీమ్ 19(22) పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి మూడు ఓవర్లు దూకుడుగా ఆడిన యూఏఈ బ్యాటర్లు.. ఆ తర్వాత తేలిపోయారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ నాలుగు వికెట్లతో రాణించాడు. శివమ్ దూబె మూడు, బుమ్రా, అక్షర్‌పటేల్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. కుల్‌దీప్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

# ఆ గాయం బాధ వర్ణనాతీతం..

## నా కెరీర్‌ను ముగించాల్సిన పరిస్థితి : శ్రేయస్ అయ్యర్

ఐపీఎల్‌లో అత్యుత్తమ సారథిగా నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్‌కు భారత జట్టులో అవకాశాలు తక్కువగానే వస్తున్నా యి. తాజాగా ఆసియా కప్ జట్టులోకి తీసుకోని మేనేజ్‌మెంట్ భారత్ జట్టుకు కెప్టెన్‌ను చేసింది. ఆస్ట్రేలియాతో అనధికారిక టెస్టులు, వన్డేలను భారత్ ఆడనుంది. ఈక్రమంలో ఇటీవల ఇంటర్వ్యూల్లో తన ప్రదర్శనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రేయస్.. ఒకదశలో గాయం కారణంగా కెరీర్‌ను అర్ధంతరంగా ముగించే పరిస్థితి ఎదురైందని పేర్కొన్నాడు. 2023లో వెన్నునొప్పి సమస్యతో తీవ్రంగా బాధపడినట్లు శ్రేయస్ తెలిపాడు. "నేను నొప్పిని అధిగమించిన ఆ దశలో నాకు ఎదురైన బాధను ఎవరూ అర్థం చేసుకోలేరు. ఒక కాలు పక్షవాతంతో పడిపోయినట్లు అనిపించింది. వెన్నెముకకు సర్జరీ చేయించుకొని ఇప్పటికీ ఓ రాడ్‌తో నెట్టుకొస్తున్నా. కానీ, సయాటికా నెర్వ్ తీవ్రంగా ఇబ్బందిపెట్టింది. ఆ నొప్పిని తట్టుకోవడం నావల్ల కాలేదు. నా పాదం చిటికెన వేలు వరకూ నొప్పి వ్యాపించింది. నా కెరీర్ ముగిసిపోయిందేమో అనిపించింది. ఆ తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయా. కానీ, బయట ప్రజలు మాత్రం అథ్లెట్లను రోబోలుగా చూస్తారు. ప్రతి మ్యాచ్‌లోనూ గొప్ప ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటారు. దానివెనక ఎంతటి కష్టం అనుభవిస్తామో వారికి తెలియదు" అని శ్రేయస్ వ్యాఖ్యానించాడు.



### నిత్యం శ్రమిస్తూనే ఉంటా..

ఆసియా కప్ స్క్వాడ్‌కు ఎంపిక కాకపోవడంపై శ్రేయస్ స్పందించాడు. "నేను ఎప్పుడైనా సరే నా నియంత్రణలో ఉన్నవాటి పైనే దృష్టిపెడతా. నిరంతరం శ్రమిస్తూనే ఉంటా. నా నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా. ఎప్పుడు అవకాశం వచ్చినా రెండు చేతులతో అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉంటా. కెప్టెన్‌గా నాకు గౌరవం ఉంటేనే కొనసాగుతా. లేకపోతే అక్కడ ఉండలేను. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టులో నాకెంతో సౌకర్యంగా ఉంది. నాకు అవసరమైన మద్దతు దక్కింది" అని శ్రేయస్ తెలిపాడు.

# జీఎస్టీ ఎఫెక్ట్..

## ధరలు తగ్గించిన రాయల్ ఎన్‌ఫీల్డ్



రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి గుడ్‌న్యూస్. ఇటీవల జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలో ఆ కంపెనీ 350 సీసీ మోటార్ సైకిళ్ల ధరలను తగ్గించింది. సెప్టెంబర్ 22 నుంచి సవరించిన ధరలు అమల్లోకి రానున్నాయని కంపెనీ పేర్కొంది. జీఎస్టీ ప్రయోజనాన్ని పూర్తిగా వినియోగదారులకు బదలాయిస్తున్నట్లు వెల్లడించింది. 350 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన మోటార్ సైకిళ్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో 350 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న మోడళ్లకు ఇకపై 40 శాతం పన్ను వర్తిస్తుంది. ఈనేపథ్యంలో ఇతర టూవీలర్ కంపెనీల్లానే రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా తన పాపులర్ మోడళ్ల ధరలు తగ్గించింది. కంపెనీ తాజా నిర్ణయంతో క్లాసిక్ 350, హంటర్ 350, మెటోర్ 350 మోడళ్ల ధరలు రూ.22 వేల వరకు తగ్గనున్నాయి. ప్రస్తుతం క్లాసిక్ 350 మోడల్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,97,253 నుంచి 2,30,000 వరకు (వేరియంట్‌ను బట్టి) ఉంది. హంటర్ ధర రూ.1,49,900 నుంచి ప్రారంభమై రూ.1,74,655 వరకు ఉంది. 350 సీసీ మోడళ్లపై జీఎస్టీ తగ్గించడం వల్ల మోటార్ సైకిళ్ల ధరలు తగ్గడమే కాకుండా.. తొలిసారి బైకులను కొనుగోలు చేయాలనుకునేవారికి ప్రేరణగా నిలుస్తుందని రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈఓ బి.గోవిందరాజన్ పేర్కొన్నారు. జీఎస్టీ (%+రూ%) ప్రయోజనాన్ని పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో 350 సీసీ కంటే అధిక సామర్థ్యం కలిగిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోడళ్ల ధరలు పెరగనున్నాయి.

### అదే బాటలో హీరో మోటోకార్ప్

జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో సెప్టెంబర్ 22 నుంచి తమ మోటార్ సైకిళ్ల ధరలు తగ్గిస్తున్నట్లు హీరో మోటోకార్ప్ తెలిపింది. వివిధ మోడళ్లపై రూ.15,743 వరకు ధర తగ్గిస్తున్నట్లు ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో పేర్కొంది. హీరో మోటోకార్ప్ స్ప్లెండర్ ప్లస్, గ్లామర్, ఎక్స్‌ట్రీమ్, జూమ్, డెస్టినీ, ప్లెజర్‌ం పేరుతో మోటార్ సైకిళ్లు, స్కూటర్లు విక్రయిస్తోంది. కంపెనీ తాజా నిర్ణయంతో ఆయా మోడళ్ల ధరలు తగ్గనున్నాయి. ఇప్పటికే టీవీఎస్, బజాజ్ ఆటో ఇదేతరహా ప్రకటన చేశాయి.

# సుంకాలపై పోరుకు అమికస్ క్యూరీ సాయం

## భారత్ యత్నాలు

**ఢిల్లీ:** రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కారణంగా చూపుతూ భారత్‌పై అమెరికా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. రష్యాతో వ్యాపారాన్ని కారణంగా చూపుతూ ట్రంప్ యంత్రాంగం విధిస్తున్న సుంకాలను యూఎస్‌లోని కోర్టులో సవాలు చేయాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ సంస్థ నివేదిక సూచించింది. ఇందుకోసం అమెరికా సుప్రీంకోర్టులో బ్రీఫ్‌ను దాఖలు చేసేందుకు అత్యవసరంగా భారత్ అమికస్ క్యూరీ ని నియమించేందుకు ప్రయత్నించాలని పేర్కొంది. ఈ విషయంపై భారత్ వెంటనే చర్యలు తీసుకోకుంటే అమెరికా విధించే శిక్షాత్మక సుంకాలను భారత్ సమర్థించినట్లేనని, ట్రంప్ చేస్తున్న వాదనను ఒప్పుకున్నట్లు అవుతుందని జీటీఆర్ఐ సంస్థ హెచ్చరించింది. ట్రంప్ విధిస్తున్న సుంకాల విషయంలో భారత్ ప్రత్యక్ష పార్టీగా ఉండకూడదని జీటీఆర్ఐ పేర్కొంది. అమెరికాలోని సుప్రీంకోర్టులో భారత్ తరఫు వాదనను వినిపించడానికి అమికస్ క్యూరీని నియమించుకో వడం ఒక్కటే మార్గమని తెలిపింది. దీనిద్వారా ట్రంప్ విధిస్తున్న సుంకాలు వివక్షతో కూడుకున్నవని.. చట్టవిరుద్ధమైన వని నిరూపించవచ్చని వివరించింది. ఇందుకోసం అమెరికా విధిస్తున్న సుంకాల వల్ల భారత ఎగుమతులు, అమెరికాలో ధరల పెరుగుదల వంటి ప్రభావాలను ఎత్తి చూపాలని సూచించింది. అమికస్ క్యూరీ బ్రీఫ్‌ను దాఖలు చేయడం ద్వారా.. భారత్ తన కేసును అమెరికా న్యాయవ్యవస్థ అత్యున్నత స్థాయిలో విచారించేలా చేస్తుందని జీటీఆర్ఐ తెలిపింది. ప్రపంచ దేశాలపై పన్నులు విధించేందుకు బ్రేకులు పడుతుండటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫెడరల్ చట్టం ప్రకారం అధ్యక్షుడికి




దిగుమతులపై సుంకాలు విధించే హక్కు ఉందని పేర్కొంటూ ఈ కేసును అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది. ఎమర్జెన్సీ అధికార చట్టం ప్రకారం ట్రంప్ సుంకాలు విధించారని ఇటీవల అప్పీల్ కోర్టు తీర్పునిచ్చింది. ఆ సుంకాలు చట్టవిరుద్ధమని పేర్కొనడంతో ట్రంప్ యంత్రాం గం సుప్రీం తలుపుతట్టింది.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించడంతో ప్రపంచ మార్కెట్లు వణికిపోయాయి. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకుండా పన్నులతో ఐరోపా యూనియన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం సుంకాలు వసూలుచేస్తోంది. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ రష్యా నుంచి చమురుకొంటున్న భారత్‌పై ఇంకా పూర్తిస్థాయిలో ఆంక్షల మోత మోగించలేదని వ్యాఖ్యానించారు. సుంకాలతో అమెరికాను భారత్ చంపేస్తోందని ఆరోపించారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పాలనే తమ ప్రయత్నాల్లో ఈ సుంకాలు కీలకమైన అంశమని ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టులో వాదించినట్లు సమాచారం.

# వారంలో మూడు రోజులు

# ఆఫీసుకు రావాల్సిందే..

## ఉద్యోగులతో మైక్రోసాఫ్ట్




వర్క్ ఫ్రమ్ హోమ్‌కు స్వస్తి పలుకుతూ ఐటీ కంపెనీలు ఉద్యోగులను కార్యాలయా లకు రప్పించే పనిలో పడ్డాయి. తాజాగా అందులో టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా చేరింది. ఉద్యోగులు వచ్చే ఏడాది నుంచి వారంలో కనీసం మూడు రోజులైనా ఆఫీసుకి రావాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు బ్లాగ్‌లో ఓ పోస్టు పెట్టింది. ఈ విధానాన్ని మూడు దశల్లో అమలుచేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మాన్ బ్లాగ్‌లో పేర్కొన్నారు. తొలుత వాషింగ్టన్, రెడ్‌మండ్ కంపెనీ ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులతో దీన్ని మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో ఇదే విధానం అమలవుతుందని వెల్లడించారు. కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి 50 మైళ్ల దూరంలో నివసించే ఉద్యోగులకు 2026 ఫిబ్రవరి చివరి నుంచి ఈ విధానం అమలుకానున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అమెరికాలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చే విషయానికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. మహమ్మారి సమయంలో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ కల్చర్ నుంచి దాదాపు అన్ని కంపెనీలు బయటకు వస్తున్నాయి. తమ ఉద్యోగుల్ని తిరిగి ఆఫీసులకు రప్పించేందుకు ఐటీ సంస్థలు అనేక చర్యలు చేపడుతున్నాయి. హెచ్‌సీఎల్, అమెజాన్ , ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీసుకు వచ్చి పనిచేసేలా ప్రోత్సహిస్తున్నాయి.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.rajamudranews.com

# ప్రేమ తన మధురత్వాన్ని కనుగొంటుంది

## తేజు అశ్విని

టాలీవుడ్ యంగ్ హీరో శివ కందుకూరి, ప్రమోద్ హర్ష కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ 'చాయ్ వాలా'. హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్ పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇందులో శివ సరసన తేజు అశ్విని హీరోయిన్‌గా నటిస్తోంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి, చైతన్య కృష్ణ, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో థియేటర్స్‌లోకి రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తూ మేకర్స్ ఆసక్తిని పెంచుతున్నారు. ఈక్రమంలో.. తాజాగా, 'చాయ్ వాలా' చిత్రబృందం మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసినట్లు తేజు అశ్విన్ ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'సఖిరే' మెలోడీ సాంగ్ ప్రొమో రిలీజ్ చేసింది. ఫుల్ సాంగ్ సెప్టెంబర్ 11న సాయంత్రం 5గంటలకు రాబోతున్నట్లు వెల్లడించింది. ఈ పోస్ట్‌కు "ప్రేమ తన మధురత్వాన్ని కనుగొంటుంది" అనే క్యాప్షన్ జత చేసింది.



# వరుణ్ దంపతులకు మగబిడ్డ

నటుడు వరుణ్ తేజ్,లావణ్య త్రిపాఠి దంపతులు తల్లిదండ్రులు అయ్యారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిరంజీవి కూడా మన శంకరవరప్రసాద్‌గారు సెట్స్ నుంచి నేరుగా ఆసుపత్రికి వెళ్లి వరుణ్, లావణ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. తాము తల్లిదండ్రులం కానున్నట్లు వరుణ్ తేజ్ మేలో సోషల్ మీడియా వేదికగా తెలిపారు. జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్ అనే క్యాప్షన్‌తో శుభవార్తను పంచుకున్నారు. తాజాగా వీరికి బాబు పుట్టడంతో మెగా ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. సెలబ్రిటీలు ఈ జంటకు విషెస్ చెబుతున్నారు. లావణ్య త్రిపాఠిని వరుణ్ తేజ్ ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. 2017లో మిస్టర్ సినిమా కోసం వరుణ్ లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు.



# మెగాస్టార్‌ను కలుసుకున్న పూరిసేతుపతి బృందం


అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా ప్రాజెక్ట్ పూరి సేతుపతి. విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో టబు హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా.. తాజాగా



ఈ చిత్రయూనిట్ మెగాస్టార్ చిరంజీవిని కలుసుకుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు అనే సినిమాను తెరకెక్కిస్తు న్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఈ సినిమా పక్కనే షూటింగ్ జరుపుకుంటున్న పూరి సేతుపతి టీమ్ చిరుని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోను చిత్రబృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఇందులో నటులు చిరంజీవితో పాటు విజయ్ సేతుపతి, టబు, నయనతార, ఛార్మీ తదితరులు ఉన్నారు.

# సూపర్ ఫీమేల్ హీరోగా కళ్యాణి ప్రియదర్శి

లోక చాప్టర్ 1: చంద్ర తెలుగులో కొత్త లోకగా విడుదలై మంచి ఆదరణ తెచ్చుకుంది. ఇప్పటికే 200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు. మలయాళంలో లోక చాప్టర్ 1: చంద్ర భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. లోక చాప్టర్ 1: చంద్ర మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగిందని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు. డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.



# వివాదంలో నయనతార డాక్యుమెంటరీ

## చంద్రముఖి క్లిప్స్ వాడకంపై మద్రాస్ హైకోర్టు నోటీసులు



లేడి సూపర్‌స్టార్ నయనతార మరోసారి వివాదంలో చిక్కుకుంది. ఆమె నటించిన డాక్యుమెంటరీ నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్ ఇప్పటికే పలు వివాదాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా నానుమ్ రౌడీ దాన్ సినిమా క్లిప్‌లను ఉపయోగించారని ఆ సినిమా నిర్మాత ధనుష్ అప్పట్లో నయనతారపై రూ. 10 కోట్ల పరువు నష్టం దావా వేశాడు. అయితే ఈ వివాదం ముగియకముందే తాజాగా మరో కేసులో ఇరుక్కుంది నయన్. ఈ డాక్యుమెంటరీలో తమ అనుమతి లేకుండా చంద్రముఖి సినిమాలోని క్లిప్‌లను ఉపయోగించారంటూ ఏపీ ఇంటర్నేషనల్ అనే సంస్థ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రముఖి సినిమా హక్కులు తమ వద్ద ఉన్నాయని, తమ అనుమతి లేకుండా డాక్యుమెంటరీలో ఆ సినిమా క్లిప్‌లను వాడారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై నయనతార, నెట్‌ఫ్లిక్స్‌కు రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ వివాదంపై సమాధానం ఇవ్వాలని నయనతార, నెట్‌ఫ్లిక్స్‌లకు నోటీసులు జారీ చేసింది. దీనిపై అక్టోబర్ 6 లోపు స్పష్టత ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కాగా ఈ రెండు వివాదాలతో నయనతార డాక్యుమెంటరీ ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమ అనుమతి లేకుండా ఆ డాక్యుమెంటరీలో చంద్రముఖి సన్నివేశాలు ప్రదర్శించడంపై నిర్మాణ సంస్థ ఏబీ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై అక్టోబరు 6లోపు సమాధానమివ్వాలని డాక్యుమెంటరీని నిర్మించిన టార్క్ స్టూడియోస్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఆ సన్నివేశాలను తొలగించాలని, రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినా తమ కంటెంట్‌తో డాక్యుమెంటరీ ప్రసారం అవుతూనే ఉందని ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్‌లో పేర్కొంది.

# మిరాయ్‌లో ట్రైన్ సీక్వెన్స్ ఓ పెద్ద అనుభూతి



తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం మిరాయ్ రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబందం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. తాజాగా ఇందులోని ట్రైన్ సీక్వెన్స్‌ను వివరిస్తూ ఓ బీటీఎస్ వీడియో విడుదల చేసింది. ఈ సీక్వెన్స్ సినిమాలో పెద్ద ఛాలెంజ్ అని.. కథను మలుపుతిప్పే సన్నివేశం అని టీమ్ పేర్కొంది. తేజ రిస్క్ చేసి ఇందులో నటించారని చిత్రబృందం తెలిపింది. ఇదిలావుంటే తన చిన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించినా.. మరోసారి ఆయనతో సినిమా చేయాలనుందని నటుడు తేజ సజ్జా తెలిపారు. అవకాశం వస్తే చిరుతో మల్టీస్టారర్ మూవీ చేస్తానన్నారు. తేజ హీరోగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం మిరాయ్ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తేజ సమాధానమిచ్చారు.

# కిష్కిందపురి నచ్చకుంటే చిత్రసీమ వదిలేస్తా

## హీరో బెల్లంకొండ శ్రీనివాస్ గట్టి నమ్మకం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. భైరవం తర్వాత వస్తున్న ఈ సినిమాపై బెల్లం కొండ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బెల్లం కొండా మాట్లాడుతూ సినిమా అంటే రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంట్టంల్గ÷న్ చేయడం. థియేటర్ లో కూర్చున్నపుడు ప్రేక్షకుడు బోర్ ఫిల్ అయి మొబైల్ చూడకుంటే ఆ సినిమా హిట్. నేను కాన్ఫిడెంట్ గా చెప్తున్న కిష్కిందపురి సినిమా స్టార్ట్ అయిన పది నిమిషాల తర్వాత ఆడియెన్స్ ఫోన్ చూడరు. ఒకవేళ అలా ఎవరైనా చూస్తే నేను అసలు ఇంకా సినిమాలు చేయను ఇండస్ట్రీ వదిలి వెళ్తాను. ఈ సినిమా అంత బాగుంటుంది. ఇది నేను ఛాలెంజ్ చేసి చెప్తున్నా. ఈ సినిమా కథపై నమ్మకంతో చెప్తున్న. కథ పరంగా, సౌండింగ్ పరంగా ఈ సినిమా చాలా బాగుంటుంది. ఆ నమ్మకంతో చెప్తున్న కిష్కింధపురి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది అని అన్నారు. బెల్లం కొండా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి బెల్లం స్టార్ మాటలు ఎంతవరకు నిజమవుతాయో రెండు రోజుల్లో తెలుస్తుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com